సీటుకు రేటు..!

అనంతపురం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ పోస్టుకు డిమాండ్



అనంతపురం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

- ముడుపులు ఇస్తేనే భర్తీ
- పోటీలో ముగ్గురు సబ్‌రిజిస్ట్రార్లు
- మరో రెండు పోస్టులున్నా నియమించడంలో ఉన్నతాధికారుల నిర్లక్ష్యం

అనంతపురం కలెక్టరేట్, జూలై 14(ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిత్య వంపకాలే అన్నది బహిరంగ రహస్యమే. అక్కడ కీలకమైన సబ్‌రిజిస్ట్రార్ పోస్టుపైనే అందరి దృష్టి ఉంటుంది. అందులోనూ కీలకమైన కార్యాలయాల్లో ఆ పోస్టుకుండే డిమాండ్ అంతాఇంతా కాదు. అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్ పోస్టు కూడా ఆ కోవలోకే వస్తుంది. జిల్లాలో రామ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తరువాత అత్యధిక డాక్యుమెంట్లు జరిగే కార్యాలయం ఇదే. ఇందులో సబ్ రిజిస్ట్రార్ పోస్టుకు ఎప్పటిలాగే ఈసారి కూడా డిమాండ్ ఏర్పడింది. ముగ్గురు అధికారులు తీవ్రంగా పోటీ పడుతున్నారు. ఓ కీలక అధికారికి ముడుపులు అందజేస్తేనే ఆ సీటు భర్తీ అవుతుందనే ప్రచారం జరుగుతోంది. జిల్లాలో మరో రెండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆ సీట్లు ఖాళీగా ఉన్నా రూరల్ సీటుకే డిమాండ్ ఉండటం గమనార్హం.

ముడుపులు ఇస్తేనే...

అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్‌రిజిస్ట్రార్ సీటులో కూర్చోవాలంటే ముడుపులివ్వాల్సిందేనన్న గుసగుసలు ఆ శాఖలో వినిపిస్తున్నాయి. రూరల్ మండలంలోని భూములు అనంతపురం నగరానికి సమీపంలో ఉండటంతో వాటి ధరలు అధికంగా ఉంటున్నాయి. రిజిస్ట్రేషన్లు జరిగితే లావాదేవీలు ఎక్కువగానే ఉంటాయి. దీనికి తోడు కొన్ని చుక్కల, వివాద భూముల డాక్యుమెంట్ల విషయంలో పెద్ద మొత్తంలో వసూలు చేస్తారనే ఆరోపణలున్నాయి. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఓ సబ్‌రిజిస్ట్రార్ ఏసీబీకి దొరికారు. ముడుపులిచ్చేవారే ఈ సీటులోకి వస్తుంటారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. రూ.15 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఆమ్యామ్యాలిచ్చుకోవాల్సిందేనన్న విమర్శలున్నాయి. ప్రస్తుతం ఆ బేరసారాలు ఇంకా ముగిసినట్లు లేవు. అందుకే ఆ సీటు భర్తీ కాలేదని తెలుస్తోంది. పది రోజులైనా అక్కడ ఎవరినీ నియమించకపోవడమే ఇందుకు నిదర్శనం. రాయలసీమ స్థాయిలో ఓ ఉన్నతాధికారికి ఆ ముడుపులు అందుతాయని సమాచారం.



పోటీలో ముగ్గురు...

అనంతపురం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ పోస్టుకు ఎప్పటిలాగే ఈసారి డిమాండ్ ఏర్పడింది. ఏకంగా ఆ సీటులోకి రావడానికి ముగ్గురు సబ్‌రిజిస్ట్రార్లు పోటీ పడుతున్నారు. హిందూపురంలో పనిచేస్తున్న రాజశేఖర్, సెలవులో ఉన్న శిరీషా భరత్, కడప జిల్లా రాయచోటిలో పనిచేస్తున్న సబ్‌రిజిస్ట్రార్ సత్తార్ ఆ సీటులోకి రావడానికి గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఆ పోస్టుకు అధికారిని కేటాయించడానికి మరో వారం రోజులైనా ప డుతుందని ఆ శాఖ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అక్కడ ఇన్‌చార్జిగా ఉన్న సీనియర్ అసిస్టెంట్ టీజీ రెడ్డి కొనసాగవచ్చనే ప్రచారమూ లేకపోలేదు.

ఆ రెండు పోస్టులకు...

జిల్లాలో మరో రెండు సబ్‌రిజిస్ట్రార్ పోస్టుల్లో ఇన్‌చార్జిలే కొనసాగుతున్నారు. కళ్యాణదుర్గం, తాడిపత్రిలో సీనియర్ అసిస్టెంట్‌లే ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్లుగా ఉన్నారు. ఆ రెండు స్థానాలకు ఎవరినీ నియమించలేదు. కళ్యాణదుర్గంలో ప్రస్తుత అధికార పార్టీ నేతల పరిచయంతో ఆ సీటుకు మరొకరిని రానిచ్చే పరిస్థితి కనిపించడం లేదని తెలుస్తోంది. తాడిపత్రిలో ఆయన స్థానికంగా ఉండటంతో రాజకీయంగానూ ప్రభావం చూపుతున్నట్లు తెలుస్తోంది. ఓ సబ్‌రిజిస్ట్రార్ అక్కడికి రావడానికి ప్రయత్నించినా వీలుకాలేదని తెలిసింది. మరి కొంత కాలం ఆ పోస్టుల్లో సబ్‌రిజిస్ట్రార్లను ఉన్నతాధికారులు నియమించే ధైర్యం చేయలేరనే ప్రచారం జరుగుతోంది.

నీటి విడుదలకు ఏర్పాట్లు చేయండి

హెచ్చెల్సీ అధికారులకు 'కాలవ' ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న కాలవ

అనంతపురం క్రైం, జూలై 14(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ప్రాజెక్టు నుంచి హెచ్చెల్సీకి నీటి విడుదలకు ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. హెచ్చెల్సీ లోకలైజేషన్ అధికారులతో అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కాలువ అత్యవసర మరమ్మతుల కోసం రూ.35 కోట్లు మంజూరు చేయించామన్నారు. కాలవ బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో బెడ్డింగ్, సైడ్ లైనింగ్ పనులు, శిథిలావస్థలో ఉన్న బ్రిడ్జిలు, అండర్ టన్నెల్ ప్రాంతాల్లో కొత్త నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేస్తున్నట్లు తెలిపారు. ఆయకట్టు సాగుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇంజనీర్లు రేయింబవళ్లు పనులు చేయిస్తున్నారని తెలిపారు. తుంగభద్ర ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాల వల్ల డ్యాం నిండుకుండలా ఉందన్నారు. ఈనెల 17న ప్రాజెక్టు వద్ద ఆంధ్రా నీటి వాటాని విడుదల చేస్తే 18వ తేదీ ఆంధ్రా సరిహద్దుకు వస్తాయన్నారు. ఈలోగా అడ్డంగా ఉన్న మట్టికుప్పలు, ఇతర అవాంతరాలను తొలగించే పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ పార్థసారథి, డీఈ దివాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయపూర్‌లో జవాను ఆత్మహత్య

ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలే కారణం..?



4

వైసీపీలో అయోమయం..!

- తాడిపత్రిలో సమన్వయకర్త లేమి
- దిక్కుతోచని స్థితిలో కార్యకర్తలు
- వర్గాలుగా పార్టీ కార్యక్రమాలు



తాడిపత్రి, జూలై14(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వైసీపీకి సమన్వయకర్తలేక కార్యకర్తల్లో అయోమయం ఏర్పడింది. పార్టీ కార్యక్రమాలు చేపట్టేవారు లేరు, సమస్య వస్తే అండగా నిలిచేవారూ కరువయ్యారు. దీంతో వైసీపీ క్యాడర్ బలహీనపడుతోందని ఆ పార్టీ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఏడాదిన్నరగా సమన్వయకర్త లేకపోవడంతో ఎవరి దారి వారు చూసుకుంటున్నారని తెలుస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం తరువాత పార్టీ సమన్వయకర్తను నియమించలేదు. మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి తాడిపత్రికి రాలేని పరిస్థితి ఏర్పడింది. పెద్దారెడ్డి తాడిపత్రిలోకి వస్తే అడ్డుకుని తీరతామంటూ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డితోపాటు కౌన్సిలర్లు, కార్యకర్తలు ఇప్పటికే పలుసార్లు బహిరంగంగా ప్రకటించారు. అడ్డుకున్నారు కూడా. ఈ నేపథ్యంలో పెద్దారెడ్డి తాడిపత్రిలోకి రావడం కష్టమేనని రాజకీయ పండితులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీలో వర్గాలు ఏర్పడ్డాయి. పెద్దారెడ్డి, రమేష్‌రెడ్డి, ఫయాజ్‌బాషా వర్గాలుగా విడిపోయారు. ఎవరికి వారే పార్టీ కార్యక్రమాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సమన్వయకర్తగా ఎవరిని నియమిస్తారన్న చర్చ సాగుతోంది. ఇప్పటికే పలుమార్లు మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి కలవడంతో ఆయనకే సమన్వయకర్త బాధ్యతలు అప్పగిస్తారన్న ప్రచారం సాగుతోంది. ముస్లిం నాయకుడు ఫయాజ్ బాషాకు ఇస్తారన్న వాదనలు కూడా బలంగానే వినిపిస్తున్నాయి. వీరిలో ఎవరిని సమన్వయకర్తగా నియమించినా.. జేసీ ప్రభాకర్ రెడ్డికి ఎదురొడ్డి పార్టీని నడిపించగలరా అన్న సందేహాలు ఏర్పడ్డాయి. పెద్దారెడ్డి స్వగ్రామం తిమ్మంపల్లికే పరిమితం అవడంతో తాడిపత్రిలో తమకు ఇబ్బంది తలెత్తితే ఎవరు అండగా నిలుస్తారని కార్యకర్తలు వాపోతున్నారు. రమేష్‌రెడ్డి ఉన్నా.. ఆయన కార్యక్రమాలకు హాజరవడం, మాట్లాడడం వరకే పరిమితమవుతున్నారన్న చర్చలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలూరు సాంబశివారెడ్డితోపాటు మరికొంతమంది నాయకుల ద్వారా రమేష్‌రెడ్డి సమన్వయకర్త పోస్టు కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని ఆ పార్టీలో చర్చ సాగుతోంది. ఇప్పటికే సమన్వయకర్తగా రమేష్‌రెడ్డి పేరు ఖరారైందనీ, రేపో.. మాపో.. ప్రకటిస్తారన్న చర్చలు కూడా వినిపిస్తున్నాయి.

ఉప ఎన్నికపై సమీక్ష

రామగిరి, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఎంపీపీ ఉప ఎన్నికపై మండల అధికారులు సోమవారం సమీక్షించారు. ఇన్‌చార్జి సీఐ రెడ్డప్ప, ఎస్‌ఐ సుధాకర్ యాదవ్, ఎంపీడీఓ గంగావతి, ఏఓ వెంకటేశ్వర ప్రసాద్ సమావేశమయ్యారు. ఈనెల 16న ఎన్నిక సందర్భంగా తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. ఎన్నికల అధికారి సంజీవయ్యతో సీఐ ఫోన్‌లో మాట్లాడి, ఎన్నికకు సంబంధించి సమాచారం తెలుసుకున్నారు. ఎన్నిక నిర్వహించే గదిలో సీసీ కెమెరాలు, సీట్ల ఏర్పాటు వివరాలు తెలుసుకున్నారు. కోరంలేక ఎంపీపీ ఉప ఎన్నిక ఇదివరకే రెండుసార్లు వాయిదా పడింది. ఈసారి సభ్యులందరికీ నోటీసులు నోటీసులు అందించామని అధికారులు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఎంపీపీ ఎన్నికకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



ఎంపీడీఓతో చర్చిస్తున్న ఇన్‌చార్జి సీఐ రెడ్డప్ప, ఎస్‌ఐ సుధాకర్ యాదవ్

వివరాలు 5లో
పెళ్లి కాలేదని నమ్మించి.. వంచించిన వీఆర్వో
11 పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీలు

వస్తున్నా.. పెద్దారెడ్డీ..!



విమానం దిగుతున్న జేసీపీఆర్

తాడిపత్రి, జూలై 14(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రికి వస్తున్నాడని తెలియగానే హుటాహుటిన మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి వచ్చేశారు. రీకాలింగ్ చంద్రబాబు మ్యానిఫెస్టో కార్యక్రమంలో పాల్గొనడానికి పెద్దారెడ్డి మంగళవారం తాడిపత్రికి వస్తున్న ట్లు టీడీపీ నాయకుల ద్వారా జేసీ ప్రభాకర్ రెడ్డికి తెలిసింది. దీంతో విదేశీ పర్యటనలో ఉన్న ఆయన వెంటనే బయలుదేరి వచ్చారు. విదేశాల నుంచి విమానంలో హైదరాబాద్‌కు, అక్కడి నుంచి రోడ్డు మార్గాన తాడిపత్రికి సోమవారం చేరుకున్నారు. దీంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. పెద్దారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు తప్ప.. వేరే ఎవరు సమావేశాలు పెట్టుకున్నా తమకు అభ్యంతరం లేదని టీడీపీ నాయకులు తెలిపారు.

పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడే లీడర్: ఏపీసీ

అనంతపురం విద్య, జూలై 14(ఆంధ్రజ్యోతి): పాఠశాలకు హెచ్‌ఎం లీడర్ అని, నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని సమగ్రశిక్ష ఏపీసీ శైలజ సూచించారు. లీడర్‌షిప్‌పై శిక్షణ తరగతులను బుక్కరాయసముద్రం మండలంలోని విజయ భారతి బీఈడీ కాలేజ్‌లో సోమవారం ఏర్పాటు చేశారు. తొలివిడతలో జిల్లాలోని 235 మందిపీఎస్ హెచ్‌ఎంలకు శిక్షణ మొదలైంది. ఈ తరగతులను ఏపీసీ తనిఖీ చేసారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకుడు సురేష్ కుమార్, ఏఎంఓ వేణుగోపాల్, ఎంఈఓలు లింగానాయక్, గురుప్రసాద్ పాల్గొన్నారు.

అదే గందరగోళం..!

- ఎంఎస్‌కేలకు అందని బదిలీ ఉత్తర్వులు
- డీపీఓ గ్రీవెన్స్‌కు అనుమతించని అధికారులు
- పోలీసు శాఖలో 15 రోజులుగా ఇదే పరిస్థితి

అనంతపురం క్రైం, జూలై 14(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులకు తిప్పలు తప్పడం లేదు. 15 రోజులైనా చాలా మందికి బదిలీలపై క్లారిటీ ఇవ్వడం లేదు. పీజీఆర్‌ఎస్‌లో గ్రీవెన్స్ ఇవ్వడానికి కూడా బాధితులకు సోమవారం లోపలికి అనుమతించలేదు. సుమారు 30 మంది వరకూ డీపీఓ బయటే పడిగాపులు కాసి వెనుతిరిగారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గత నెల 30వ తేదీ గ్రామ, వార్డు సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. పోలీసు శాఖ ఉన్నతాధికారులు అశాస్త్రీయ, అనాలోచిత నిర్ణయాల వల్ల వందలాది మంది బదిలీలలో గందరగోళం ఏర్పడింది. దీంతో మళ్లీ మూడు రోజుల తర్వాత మరోసారి అర్ధరాత్రి వరకూ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా చాలా మంది తాము కోరుకున్న స్థానాలను కాదని, అధికారులకు నచ్చినవి ఇచ్చారని పలువురు కన్నీళ్లు పెట్టుకుని వెనుతిరిగారు. ఇంత జరిగినా సమస్యను పరిష్కరించలేదు. 15 రోజులుగా నాన్చుతూనే ఉన్నారు.

అర్హులకు అన్యాయం

పైరవీలు, పొలిటికల్ సిఫార్సుల కారణంగా అర్హులకు అన్యాయం చేశారని బాధితులు వాపోతున్నారు. గత నెల 30న జరిగిన కౌన్సెలింగ్‌లో సీనియారిటీ జాబితాలో ముందున్న ఎంఎస్‌కేలు క్లియర్ వేకెన్సీలకు ఆప్షన్లు ఇచ్చి వెళ్లారు. ఆ తర్వాత ఇచ్చిన ఆర్డర్లు చూస్తే రేషనలైజేషన్‌లో ఎఫెక్ట్ (నో పోస్టు) అయిన స్థానాలను ఇచ్చారు. చాలా మంది అర్హులకు రేషనలైజేషన్‌లో ప్రభావితమై.. మిగిలిన పోస్టులను కేటాయించారు. ఈ సమస్య పరిష్కారం కోసం బాధితులు ఎదురు చూస్తున్నారు. డీపీఓలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో విన్నవించుకుందామని వెళితే లోపలికి వెళ్లనీకుండా అడ్డుకున్నారు. తమ కళ్లెదుటే ఎస్పీ వెళ్లారని, పట్టించుకోలేదని బాధితులు వాపోయారు.

కొందరికి ఆర్డర్లు ఇవ్వలేదు

ఎంఎస్‌కేల బదిలీ ఉత్తర్వులు కొన్ని మండలాలకు డీపీఓ నుంచీ పంపారు. కొందరికి ఇప్పటి వరకూ ఉత్తర్వులు ఇవ్వలేదు. అనంతపురం నగరంలోని చాలా మంది మహిళా సంరక్షణ కార్యదర్శులకు ఉత్తర్వు కాపీలు ఇవ్వలేదు. దీంతో ఇప్పటి వరకూ జరిగిన రెండు, మూడు కౌన్సెలింగ్‌లలో తాము ఇచ్చిన ఆప్షన్ల మేరకు బదిలీలు చేస్తారా..? లేక మరో చోటుకు బదిలీ చేస్తారా..? అని వారు టెన్షన్ పడుతున్నారు.

రేపు స్పాట్ అడ్మిషన్లు

అనంతపురంవిద్య జూలై 14(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమశాఖ గురుకుల విద్యాలయాలలో మిగులి ఉన్న టెన్త్, ఇంటర్ సీట్లకు ఈనెల 16న స్పాట్ అడ్మిషన్లు చేపట్టినట్లు జిల్లా సమన్వయ అధికారి జయలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఆర్ట్స్ గ్రూపులోమాత్రమే సీట్లు ఉన్నాయన్నారు. నల్లమాడలో సీఈసీ, ఉరవకొండలో ఎంఈసీ, సీఈసీ, బ్రహ్మసముద్రంలో సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపుల్లో ఖాళీలు ఉన్నాయన్నారు. పదోతరగతిలో ఉరవకొండ, హిందూపురం, అమరాపురం, మలగూరులో పరిమిత ఖాళీలు ఉన్నాయన్నారు. సీనియర్ ఇంటర్‌లోను ఉరవకొండ, నల్లమాడ, కురుగుంట, హిందూపురం బాలికలు, అమరాపురం, మలగూరులో పరిమిత ఖాళీలు ఉన్నాయన్నారు. ఈనెల 16న కురుగుంట గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు చేపడతాన్నామన్నారు.

దూరం.. దూరం..!

విస్తృతస్థాయి సమావేశానికి పెద్దారెడ్డి వర్గం డుమ్మా



మాట్లాడుతున్న సమన్వయకర్త శైలజానాథ్

యల్లనూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో సోమవారం నిర్వహించిన వైసీపీ విస్తృత స్థాయి సమావేశానికి పెద్దారెడ్డి వర్గం డుమ్మా కొట్టింది. రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంలో భాగంగా జడ్పీటీసీ సభ్యుడు భోగాతి ప్రతాప్‌రెడ్డి నివాసంలో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి శింగనమల వైసీపీ సమన్వయకర్త శైలజానాథ్ హాజరయ్యారు. సమావేశం భోగాతి ప్రతాప్‌రెడ్డి ఇంటిలో ఏర్పాటు చేయడంతోనే పెద్దారెడ్డి వర్గీయులు దూరంగా ఉండాలని భావించినట్లు తెలిసింది. మండలంలో వైసీపీలోని రెండువర్గాలు కలిసే అవకాశాలు లేవని ఆ పార్టీ కార్యకర్తలే చెబుతుండటం గమనార్హం. వైఎస్ఆర్ జయంతి రోజు కూడా ఒక వర్గానికి మాత్రమే అధిక ప్రాధాన్యం కల్పించారనే చర్చ జరుగుతోంది. కార్యక్రమంలో కల్లూరు ప్రతాప్‌రెడ్డి, పాతపల్లి ప్రభాకర్‌రెడ్డి, నిట్టూరు నాగేంద్రరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ క్యాంపునకు డిగ్రీ ఎన్‌సీసీ క్యాడెట్లు



ఎంపికైన ఎన్‌సీసీ క్యాడెట్లతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ధర్మవరం, జూలై 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న 8 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు ఆర్మీ అటాచ్‌డ్ క్యాంప్‌నకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన ఎన్‌సీసీ క్యాడెట్లు సికింద్రాబాద్‌లో 76వ ఇన్ఫాంట్రీ (పదాతిదళం) బ్రిగేడ్ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే క్యాంపులో పాల్గొంటారన్నారు. ఎంపికైన వారిలో లక్ష్మన్న, నిఖిల్, సాయినిఖిల్, బాల ఓబుళేశు, వెంకటసాయికృష్ణ, పోతిరెడ్డి, ధనుష్, అహమ్మద్ ఉన్నట్లు వెల్లడించారు.

మీ కాళ్లు పట్టుకుంటా..!

కందుల కోసం వేడుకున్న రైతు... పోలీసులకు ఫిర్యాదు చేసిన ఏఈఓ



ఏఈఓ కాలికి టవల్ చుట్టి కూర్చున్న రైతు

కుందుర్పి, జూలై 14(ఆంధ్రజ్యోతి): ప్రత్యామ్నాయ పంట సాగు కోసం కందులు ఇవ్వాలని ఓ రైతు ఏఈఓ కాళ్లు పట్టుకున్నారు. ఆయన్ను కదలనివ్వకుండా తన టవల్‌ను ఏఈఓ కాలుకు చుట్టి భీష్మించాడు. ఈ సంఘటన కుందుర్పి మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానిక రైతు సేవా కేంద్రానికి రైతు కేజీ గోపాల్ మధ్యాహ్నం రెండు గంటలకు వచ్చారు. అప్పటికే కందుల పంపిణీ ముగిసింది. ఉన్న కందులన్నీ పంపిణీ చేశామని ఏఈఓ గుణశేఖర్ రైతులకు తెలిపారు. దీంతో కందులు అందని రైతులు దిగాలుగా అక్కడే కూలబడిపోయారు. కానీ రైతు గోపాల్ మాత్రం తీవ్ర ఆవేదనలోనయ్యారు. ఎలాగైనా తనకు కందులు ఇవ్వాలని ఏఈఓను ప్రాధేయపడ్డారు. ఆయన వెళ్లిపోతుండటంతో వెంటపడి, తన భుజం మీద ఉన్న కండువాను తీసి కాలికి చుట్టి గట్టిగా పట్టుకున్నారు. తోటి రైతులు గోపాల్‌కు సర్ది చెప్పి, ఏఈఓను పంపించారు. రైతు ఆవేదనను అర్థం చేసుకోకుండా, ఏఈవో గుణశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మద్యం మత్తులో ఆ రైతు తన విధులకు ఆటంకం కలిగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

విత్తన బకాయిలు ఇప్పించండి

ఏపీ సీడ్స్ చైర్మన్‌కు సరఫరాదారుల విజ్ఞప్తి



ఏపీసీడ్స్ చైర్మన్ సుబ్బారెడ్డితో మాట్లాడుతున్న విత్తన సరఫరాదారులు

అనంతపురం అర్బన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): విత్తన సరఫరా బకాయిలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఏపీసీడ్స్ చైర్మన్ సుబ్బారెడ్డిని ఉమ్మడి జిల్లాకు చెందిన విత్తన సరఫరాదారులు కోరారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన స్థానిక ఏపీసీడ్స్ కార్యాలయంలో ఆ సంస్థ మేనేజర్ సుబ్బయ్య, సిబ్బందితో సోమవారం సమావేశమయ్యారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో విత్తన వేరుశనగర సరఫరా గురించి ఆరా తీశారు. అనంతరం సంస్థ ఆవరణలోని గోదాములో నిల్వ ఉన్న విత్తన వేరుశనగ బస్తాలను పరిశీలించారు. ఇదే క్రమంలో ఉమ్మడి జిల్లాకు చెందిన విత్తన సరఫరాదారులు చైర్మన్‌ను కలిశారు. గత ఏడాది రబీ సీజన్‌కు సంబంధించి తమకు రూ.30 కోట్లు రావాల్సి ఉందని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి మరో రూ.53 కోట్లు రావాల్సి ఉందని తెలిపారు. బకాయిలు పెరిగిపోతుండటంతో విత్తన సరఫరాకు ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు. ఈ ఏడాది విత్తన సరఫరాలో సమస్యలు లేకుండా సహకరించాలని కోరారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

అనంతపురం అర్బన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలు, గోదాముల్లో వ్యవసాయ శాఖ కమిషనరేట్, విజిలెన్స్ స్థానిక వ్యవసాయ అధికారులు సోమవారం తనిఖీలు చేపట్టారు. కమిషనరేట్ ఏడీఏ సాలురెడ్డి, విజిలెన్స్ ఎస్ఐ నరేంద్రభూపతి, అనంతపురం ఏఓ వెంకట్ కుమార్, జేడీఏ ఆఫీస్ టెక్నికల్ ఏఓ వంశీకృష్ణ.. ఎరువుల దుకాణాల్లో స్టాక్, పలు రికార్డులు పరిశీలించారు. ఓ ఫాం లేకపోవడంతో రూ.7.25 లక్షల విలువైన ఎరువుల విక్రయాలను నిలుపుదల చేశారు. మరో నాలుగు రోజులపాటు ఎరువుల దుకాణాల్లో తనిఖీలు కొనసాగుతాయని అధికారులు పేర్కొన్నారు.

నేడు గ్రామాభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

అనంతపురం అర్బన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధి ప్రణాళికలపై మంగళవారం పంగల్ రోడ్డు సమీపంలోని టీటీడీసీలో ఏపీఎంలు, సీసీలకు శిక్షణ ఇవ్వనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శైలజ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటలకు నిర్వహించే శిక్షణకు అన్ని మండలాల ఏపీఎంలు, మండలానికి ఇద్దరు చొప్పున ఎంపిక చేసిన సీసీలు హాజరుకావాలని సూచించారు.

నెరవేరుతున్న లోకేశ్ హామీ

గార్లదిన్నెలో చీనీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు సన్నాహాలు

ఇటీవల ఫుడ్ ప్రాసెసింగ్ అధికారుల స్థల పరిశీలన

స్వాగతిస్తున్న చీనీ రైతులు



గార్లదిన్నె మండలం మర్తాడులో 800 కిలో మీటర్ల మైలురాయి శిలాఫలాన్ని ఆవిష్కరిస్తున్న నారా లోకేశ్ (ఫైల్)

అనంతపురం అర్బన్ /గార్లదిన్నె, జూలై 14(ఆంధ్రజ్యోతి): గత సార్వత్రిక ఎన్నికలకు ముందు యువగళం పాదయాత్రలో యువనేత నారాలోకేశ్ ఇచ్చిన హామీ నెరవేరనుంది. గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామంలో యువగళం 800 కిలో మీటర్ల మైలురాయిని పూర్తి చేసుకున్న సందర్భంగా టీడీపీ అధికారంలోకి రాగానే గార్లదిన్నె మండలంలో చీనీ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తామని అప్పట్లో నారా లోకేశ్ హామీ ఇచ్చారు. ఆ మేరకు మర్తాడు గ్రామంలో శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ క్రమంలోనే గార్లదిన్నె మండలంలో చీనీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసేందుకు అడుగులు పడుతున్నాయి. ఇటీవల మండలంలోని కనుంపల్లి, జంబులదిన్నె కొట్టాల ప్రాంతాల్లో రెండు చోట్ల చీనీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కోసం పొలాలను ఏపీ ఫుడ్‌ప్రాసెసింగ్ అధికారులు పరిశీలించారు.

రూ.3.5 కోట్లతో యూనిట్

చీనీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటును జిల్లా రైతులు స్వాగతిస్తున్నారు. రూ.రూ.3.5 కోట్ల వ్యయంతో 3 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో ప్రైమరీ చీనీ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని చీనీ రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఎఫ్‌పీఓకు నిర్వహణ బాధ్యతలు

జిల్లా వ్యాప్తంగా 40వేల హెక్టార్లల్లో చీనీ పంట సాగవుతోంది. జిల్లాలో పండించిన చీనీకి మంచి గిరాకీ ఉంది. వ్యాపారులు రైతుల పొలాల్లోనే చీనీ పంటను కొనుగోలు చేసి, ఢిల్లీ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. కొందరు రైతులు బయట వ్యాపారులకు చీనీ పంటను విక్రయిస్తుండగా.. మరికొందరు రైతులు అనంతపురం మార్కెట్ యార్డులో అమ్ముకుంటున్నారు. చీనీ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసిన తర్వాత ఎఫ్‌పీఓకు నిర్వహణ బాధ్యతలు అప్పగించే అవకాశం ఉన్నట్లు ఉద్యాన శాఖ అధికారులు పేర్కొంటున్నారు. చీనీ పంటను ప్రాసెసింగ్ చేసేందుకు రైతులతో నామమాత్రంగా డబ్బు వసూలు చేసేలా నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

హామీ నిలబెట్టుకుంటున్న నారా లోకేశ్



యువగళం పాదయాత్రలో నారాలోకేశ్ చీనీ రైతులకు ఇచ్చిన హామీని నెలబెట్టుకుంటున్నారు. ఇప్పటికే చీనీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసేందుకు మండలంలోని రెండు గ్రామాల్లో స్థలాలను పరిశీలించడం సంతోషకరం. త్వరగా స్థలాన్ని ఖరారు చేసి, ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

\- రైతు రామసుబ్బయ్య, మర్తాడు, గార్లదిన్నె మండలం

చీనీ రైతులకు చాలా ఉపయోగం



చీనీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తే రైతులకు చాలా ఉపయోగపడుతుంది. చీనీ కాయలను గ్రేడ్ల వారిగా ప్రాసెసింగ్ చేస్తే నాణ్యమైన కాయలకు ఎక్కువ ధర పలికే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ప్రాసెసింగ్ చేసేందుకు అవకాశం లేకపోవడంతో అన్ని కాయలను కలిపి తక్కువ ధరకు వ్యాపారులు అడుగుతున్నారు. ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తే రైతులకు గిట్టుబాటు ధర లభించేందుకు అవకాశం ఉంటుంది.

\- రైతు నరసింహారెడ్డి, ముకుందాపురం, గార్లదిన్నెమండలం

రాయపూర్‌లో జవాను ఆత్మహత్య

భార్యతో మాట్లాడిన కాసేపటికే ఘటన

ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలే కారణం..?

స్వగ్రామం శివపురంలో విషాదం



భార్య, పిల్లలతో మురళి

కనగానపల్లి, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శివపురం గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ జవాను కె.మురళి(30) ఆత్మహత్య చేసుకున్నారు. ఛత్తీ్‌సగఢ్‌లోని రాయపూర్‌లో తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకున్నట్లు అక్కడి అధికారులు కుటుంబ సభ్యులకు ఆదివారం రాత్రి సమాచారం ఇచ్చారు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యల కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నారు. శివపురం గ్రామానికి చెందిన ముత్యాలన్న, నాగలక్ష్మి దంపతులకు మురళి, అంజలి సంతానం. పొలాలు ఉన్నా.. పంటలు సరిగా పండకపోవడంతో కొన్నేళ్ల క్రితం వీరు బెంగళూరుకు వలస వెళ్లారు. ఫ్యాక్టరీలలో పని చేసుకుంటూ, అక్కడే కొడుకు, కూతురును బడిలో చేర్పించారు. మురళి డిగ్రీ చదువుతున్న సమయంలో సీఆర్‌పీఎఫ్‌కు సెలెక్ట్ అయ్యారు. చెల్లెలు అంజలిని చదివిస్తూనే, అనంతపురం నగరానికి చెందిన పావని అనే యువతిని వివాహం చేసుకున్నారు. వీరికి తారక్‌రామ్, మహి అనే కొడుకు, కూతురు ఉన్నారు. మురళి విధుల నిమిత్తం రాయపూర్‌లో ఉండగా, అంజలి తన ఇద్దరు పిల్లలతో అనంతపురంలోని పుట్టింట్లో ఉంటున్నారు. పావనికి ఆదివారం రాత్రి మురళి ఫోన్ చేశారు. పిల్లల యోగ క్షేమాలను తెలుసుకున్నారు. చెల్లెలి చదువు, బిడ్డల భవిష్యత్తు, తండ్రి ఆరోగ్యం తదితర సమస్యల గురించి చర్చించి బాధపడ్డారు. ఫోన్ పెట్టేసిన కొన్ని నిమిషాలకే మురళి ఆత్మహత్య చేసుకున్నట్లు సీఆర్‌పీఎఫ్ అధికారుల నుంచి సమాచారం అందింది. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. జవాను భౌతిక కాయం మంగళవారం ఉదయానికి శివపురం చేరుకుంటుందని బంధువులు తెలిపారు.

వెంటాడిన కష్టాలు..

బెంగళూరులో తల్లిదండ్రుల కష్టాలను చూసిన మురళి, చదువుతున్న సమయంలోనే జవానుగా ఉద్యోగం సాధించారు. ఉన్నత చదువుల గురించి ఆలోచించడం మానేసి, కుటుంబాన్ని గట్టెక్కించే బాధ్యతను తీసుకున్నారు. చెల్లెలిని చదివిస్తున్నారు. పరిస్థితులు చక్కబడుతున్న సమయంలో కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. ఆయన తండ్రి ముత్యాలన్న క్యాన్సర్ బారిన పడ్డారు. వైద్యం కోసం ఇప్పటికే రూ.లక్షలు వెచ్చించారు. ఇటీవలే తన కారును స్నేహితుడికి ఇచ్చారు. ఆ సమయంలో ప్రమాదం జరిగి ఒకరు మృతిచెందారు. బాధిత కుటుంబానికి మురళి పరిహారం ఇవ్వాల్సి వచ్చింది. ఆర్థికంగా బాగా దెబ్బతిన్నారు. తన జీతపు రాళ్లతో చెల్లెలి చదువు, వివాహం, తన బిడ్డల చదువు, భవిష్యత్తు.. ఇలా అన్నింటి గురించి ఆలోచించి భార్య వద్ద బాధపడ్డారు. ఈ సమస్యల కారణంగానే ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని భావిస్తున్నారు.

డాక్టర్లకు వన్‌టైం ప్రమోషన్..!

అసోసియేట్ నుంచి ప్రొఫెసర్‌గా ఉద్యోగోన్నతి

వివరాలు సేకరించిన డీఎంఈ

అనంతపురం వైద్యం, జూలై 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఉద్యోగోన్నతలకు రాష్ట్ర వైద్యవిద్య శాఖ శ్రీకారం చుట్టింది. వన్‌టైం ప్రమోషన్ కింద అసోసియేట్ ప్రొఫెసర్లకు ఉద్యోగోన్నతి కల్పించనుంది. ఈ మేరకు సోమవారం వైద్య కళాశాలల నుంచి వైద్య విద్య సంచాలకుడు (డీఎంఈ) వివరాలు సేకరించారు. అసోసియేట్, అసిస్టెంట్, ప్రొఫెసర్లు, వారిలో ప్రమోషన్‌కు అర్హుల వివరాలతో విజయవాడకు రావాలని పిలుపునిచ్చారు. దీంతో అసోసియేట్ ప్రొఫెసర్లు, పరిపాలనా విభాగానికి సంబంధించిన అధికారులు సోమవారం విజయవాడకు తరలివెళ్లారు.

లక్కీడాక్టర్లు..!

వైద్య కళాశాలలో ఉద్యోగోన్నతుల కోసం ఏళ్ల తరబడి వేచిచూడాల్సి ఉంటుంది. అర్హత, అనుభవం ఉన్నా ఉద్యోగోన్నతి రావాలంటే అదృష్టంగా భావించాల్సి ఉంటుంది. ఉన్నఫలంగా డీఎంఈ నుంచి ప్రమోషన్స్ అంటూ ప్రకటన రావడంతో కొంతమంది డాక్టర్లు లక్కీచాన్స్ కొట్టారని వైద్యవర్గాలు పేర్కొంటున్నాయి. అసోసియేట్‌గా వచ్చిన మూడు సంవత్సరాలకే ప్రొఫెసర్‌గా ప్రమోషన్ పొందడానికి మంచి అవకాశం దొరికిందని ఆనందం వ్యక్తంచేస్తున్నారు. రేడియాలజీ విభాగంలో 12 పీజీ సీట్లు రావడానికి కృషిచేసిన అసోసియేట్ ప్రొఫెసర్ ఒకరు తాజాగా నిర్వహించిన బదిలీల్లో వెళ్లారు. ఈఎన్‌టీలో ప్రొఫెసర్ పోస్టు ఖాళీ ఉండటంతో అసోసియేట్ ప్రొఫెసర్‌కు ఇన్‌చార్జి బాధ్యత అప్పగించారు. వారిద్దరూ ప్రొఫెసర్‌గా ఉద్యోగోన్నతి పొంది తిరిగి అదే విభాగాల్లో పనిచేయడానికి వన్‌టైం ప్రమోషన్ దోహదపడుతుందని వైద్యవర్గాలు విశ్లేషిస్తున్నాయి.

ప్రమోషన్ మాకొద్దు..!

సూపర్ స్పెషాలిటీ, బ్రాడ్ స్పెషాలిటీ ఇలా రెండు విభాగాలుగా వైద్యవిద్య కళాశాలల్లో పనిచేస్తున్నారు. సూపర్ స్పెషాలిటీ క్వాలిఫికేషన్‌తో ఆ ఆసుపత్రిలోనూ, బ్రాడ్ స్పెషాలిటీ కింద సర్వజన వైద్యశాలలో డాక్టర్లు పనిచేస్తున్నారు. నాన్ క్లినికల్ డిపార్ట్‌మెంట్ వైద్యులు మెడికల్ కాలేజీలో విధులు నిర్వహిస్తున్నారు. అర్హత ఉన్నా కొంతమంది అసోసియేట్ ప్రొఫెసర్లు ఉద్యోగోన్నతి వద్దంటూ వెనకడుగు వేస్తున్నారు. ప్రమోషన్‌లు ఇచ్చి ఇతర కాలేజీలకు బదిలీ చేస్తే మొదటికే మోసం వస్తుందని వారు భావిస్తున్నట్లు చర్చ సాగుతోంది.

డేటా పంపించాం



అసోసియేట్ ప్రొఫెసర్లకు వన్‌టైం ప్రమోషన్ కోసం డీఎంఈ నుంచి ఉత్తర్వులు రావడంతో సంబంధిత డేటాను పంపించాం. ఫైళ్లను తయారుచేసి అధికారులు విజయవాడకు తీసుకెళ్లారు. రెండురోజులపాటు అక్కడే ఉండి ప్రమోషన్ల ప్రక్రియలో పాల్గొంటారు.

\-ప్రొఫెసర్ షారోన్ సోనియా, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్

బోగస్ సర్టిఫికెట్లతో కబ్జా

కలెక్టరేట్‌లో బాధితుడి ఫిర్యాదు



షబ్బీర్

అనంతపురం కలెక్టరేట్, జూలై 14(ఆంధ్రజ్యోతి): బోగస్ సర్టిఫికెట్లతో రూ.అరకోటి విలువ చేసే తన స్థలాన్ని కబ్జా చేశారని బాధితుడు వాపోయాడు. గార్లదిన్నె మండలం శిరివరానికి చెందిన షబ్బీర్ సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో అధికారులను కలిసి తనకు జరిగిన అన్యాయాన్ని వివరించాడు. కల్లూరులో సర్వే నంబరు 173లో రూ.50లక్షల విలువైన 6సెంట్ల భూమిని జూన్ 4వ తేదీ బాబాఫకృద్దీన్ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించారని ఆరోపించాడు. ఇందులో అధికారులు కుమ్మక్కయ్యారన్నాడు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేశానన్నాడు. ఈ నెల3న తహసీల్దార్ కార్యాలయ అధికారులు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఇచ్చారని, అందులో సంబంధిత వ్యక్తికి రెండో భార్య ఉన్నట్లు తప్పుడుగా సృష్టించారని ఆరోపించాడు. 2024 సెప్టెంబరు 21న శిరివరంలోని సర్వే నంబరు 131/9లో 40 సెంట్లను బాబాఫకృద్దీన్ పేరుతోనే అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడన్నారు. ఈ విషయంపై రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ, డీఆర్‌ను కలిస్తే దానిని రద్దు చేశారన్నారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోలేదన్నారు. అక్రమార్కులు, అధికారులపై చర్యలు తీసుకోవాలని విన్నవించుకున్నాడు.

మిగులు భూమిగా మారింది:



వెంకటనాయుడు

25సంవత్సరాలుగా వ్యవసాయం చేసుకుంటున్న భూమి. తాత, తండ్రి నుంచి వారసత్వంగా సంక్రమించింది. అలాంటిది ఆన్‌లైన్‌లో కాకుండా మిగులు భూమిగా చూపిస్తోందని రాప్తాడు మండలం హంపాపురం గ్రామానికి చెందిన రైతు వెంకటనాయుడు ఆవేదన వ్యక్తం చేశాడు. నాలుగేళ్లుగా తిరుగుతున్నా అధికారులు న్యాయం చేయలేదని వాపోయాడు. అది కలెక్టర్ లాగిన్‌లో ఉంటుందని మండల అధికారులు చెబుతున్నారన్నాడు. సోమవారం అధికారులను కలిసి సమస్య విన్నవించుకున్నాడు. సర్వే నంబరు 281లో 1-64 ఎకరాలు కొంతకాలంగా ఆన్‌లైన్‌లో తన పేరుతో కనిపించడం లేదని తెలిపాడు. తన సోదరుడికి చెందిన భూమి ఆన్‌లైన్‌లో చూపిస్తోందన్నారు. తన భూమి మిగులు కింద చూపుతోందన్నాడు. 1బీ అడంగల్‌లో వచ్చేలా చేయాలని కోరినా పట్టించుకోలేదన్నారు. న్యాయం చేయాలని కోరారు.

ఏళ్లుగా తిరుగుతున్నా...



నాగభూషణం

ఐదేళ్లకుపైగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగలేదని కంబదూరు మండలం కదిరిదేవరపల్లికి చెందిన నాగభూషణం ఆవేదన వ్యక్తం చేశాడు. సర్వే నంబరు 790-2లో 4.98ఎకరాలు దీర్ఘకాలికంగా తాను సాగు చేసుకుంటున్నానని తెలిపాడు. పదేళ్ల క్రితం ఆ భూమి ధనలక్ష్మి పేరుతో ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారని తెలిపాడు. విషయం ఆలస్యంగా తెలిసి అధికారులను కోరితే సమస్య పరిష్కరించలేదన్నాడు. తన భార్య శాంతమ్మ పేరుతో ఆన్‌లైన్‌లో ఎక్కించాలని కోరుతున్నా పట్టించుకోవం లేదని, న్యాయం చేయాలని కోరాడు.

అనాథాశ్రమం ఆక్రమణ



నిరసన తెలుపుతున్న అనాథలు

అనాథలు ఉంటున్న ఆశ్రమాన్ని కబ్జా చేశామనీ, ఖాళీ చేయాలని తహసీల్దార్, ఎంపీడీఓ హెచ్చరిస్తున్నారని బెరాకా అనాథాశ్రమంలో ఉంటున్న ఆందోళన వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లో రెవెన్యూభవన్ వెనుక వైపు బైఠాయించి నిరసన తెలిపారు. కూడేరు మండలం గొట్కూరు పరిధిలోని బెరాకా అనాథాశ్రమం తరఫున బెరాకా మినిస్ట్రీ ప్రతినిధులు శ్రీరామ్ తదితరులు.. కలెక్టర్‌కు వివరించారు. సర్వే నంబరు 69-4లో 2 ఎకరాల స్థలంలో అనుమతిస్తూ 2009లో అప్పటి కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. తాజాగా 15 రోజుల క్రితం తహసీల్దార్, ఎంపీడీఓలు వచ్చి ఆ స్థల పరిధిలోని షెడ్డును కూల్చి వేశారన్నారు. ఈ స్థలం సర్వేనంబరు 75 అని, దీనికి అనుమతి లేదని ఖాళీ చేయమని ఆదేశాలిచ్చారన్నారు. 16 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నామనీ, న్యాయం చేయాలని కోరారు.

విధుల్లోకి రాకపోతే ఎస్మా

● కలెక్టర్ వినోద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, జూలై 14(ఆంధ్రజ్యోతి): శ్రీరామిరెడ్డి పథకం కింద పనిచేస్తున్న కార్మికులు మంగళవారం నుంచి విధుల్లోకి రాకపోతే ఎస్మా చట్టం ప్రయోగిస్తామని కలెక్టర్ వినోద్‌కుమార్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంపై ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో కలెక్టర్ సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం రూ.3.83కోట్ల డబ్బు ఎస్ఆర్ ఇన్‌ఫ్రా కాంట్రాక్టర్ అకౌంట్‌లో సోమవారం జమ అయ్యిందన్నారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి ఎస్ఆర్ ఇన్‌ఫ్రా కార్మికులకు 16నెలల పీఎఫ్ బకాయిలు చెల్లించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన డబ్బుతో కార్మికులకు అన్ని చెల్లింపులు పూర్తి చేసే అవకాశం ఉందన్నారు. తాగునీటి పథకం కింద ముగ్గురు కాంట్రాక్టర్లకు రూ.16కోట్ల డబ్బు చెల్లించినట్లు తెలిపారు.

పని ప్రదేశాల్లో పోష్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం(పోష్)ను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆ ధ్వర్యంలో పనిచేసే చోట మహిళలపై లైం గిక వేధింపుల(నివారణ నిషేదం, దిద్దుబాటు)చట్టం-2013 పై రూపొందించిన ప్రచార వాల్ పోస్టర్లను కలెక్టర్ సోమవారం ఆవిష్కరించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో ఈ చట్టంలోని సెక్షన్-4 ప్రకారం అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హెల్ప్‌లైన్ 181కు ఫోన్‌కాల్ చేసి మహిళల సమస్యలను తెలపవచ్చన్నారు. అనంతరం రెవెన్యూభవన్‌లో జిల్లా స్థాయి అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ సేవల గురించి బొమ్మలు, వీడియోలతో చెప్పండి

వివిధ రకాల రెవెన్యూ, ఇతర ప్రభుత్వ సేవల గురించి పీజీఆర్ఎస్ ద్వారా అర్జీలను అందించే అర్జీదారులకు అర్థమయ్యే భాషలో బొమ్మలు, వీడియోలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ రూమ్ అధికారులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక సిబ్బందితో కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సబ్ డివిజన్ అంటే ఏంటి.?, చుక్కల భూమి, మ్యుటేషన్, ఆర్ఓఆర్ కోర్టులు, మిగులు భూమి అంటే ఏంటి..?, సరిహద్దులు చూపించడం, భూమి ఆక్రమణ, జాయింట్ ఎల్‌పీఎంలు, రీ సర్వేలో విస్తీర్ణం తగ్గడం, అలైన్‌మెంట్, వెబ్‌లాండ్ కరెక్షన్, ఇళ్ల పట్టా తదితర అంశాలపై పూర్తిగా అవగాహన కలిగేలా బొమ్మలను గీయాలని, వీడియోలు రూపొందించాలని సూచించారు. కార్యక్రమాల్లో జేసీ శివనారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, డీఆర్ఓ మలోల, ఐసీడీఎస్ పీడీ నాగమణి, డీవీ విభాగం కౌన్సిలర్ ఉమాదేవి, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ శిరీష, ఎస్ఈ పీఏ రామారావు, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలసత్వం తగదు

24గంటల్లో పీ-4పై నివేదిక ఇవ్వండి

అధికారులపై కలెక్టర్ అసహనం

అనంతపురం కలెక్టరేట్, జూలై 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 బంగారు కుటుంబానికి సంబంధించి అధికారుల అలసత్వంపై కలెక్టర్ వినోద్‌కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ పలు అంశాలపై అధికారులతో సమీక్షించారు. పీ-4 విషయంలో లక్ష్యం చేరుకోకపోతే చర్యలు తప్పవన్నారు. 24 గంటల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. నిధులున్నా కొన్ని శాఖల్లో పనులు ఎందుకు చేపట్టడం లేదని అసహనం వ్యక్తం చేశారు. రెసిడెన్షియల్, నాన్‌రెసిడెన్షియల్ పాఠశాలల్లో వీలైనంత వరకు విద్యార్థులకు అడ్మిషన్ కల్పించాలని ఆదేశించారు.

800 వినతులు...

ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో 800 వినతులు అందాయి. కలెక్టర్‌తోపాటు జేసీ శివనారాయణ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్‌రహార్, డీఆర్వో మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మల్లికార్జున, ఆనంద్, తిప్పేనాయక్, ఎఫ్ఎస్ఓ రామకృష్ణారెడ్డి, వ్యవసాయ శాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ అర్జీలను స్వీకరించారు.

జాతీయ హాకీ జట్టుకు కదిరి బాలిక



సీవీ లక్షిత

కదిరి అర్బన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): జాతీయ హాకీ జట్టుకు కదిరికి చెందిన విద్యార్థి సీవీ లక్షిత ఎంపికయ్యారు. ఇటీవల హరియాణాలోని హీసర్‌లో జరిగిన ఆల్‌ఇండియా ఐపీఎస్‌సీ బాలికల అండర్- 17 ప్రీ నెహ్రూ కప్ పోటీల్లో ఈమె కిట్టూరులోని రాణీ చెన్నమ్మ సైనిక్ స్కూల్ తరఫున పాల్గొన్నారు. ఈ పోటీల్లో మెరుగైన ప్రతిభ కనబరిచి ఉత్తమ గోల్‌కీపర్ అవార్డు గెలుచుకున్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన లక్షితను జాతీయ అండర్-16 హాకీ జట్టుకు ఎంపిక చేశారని సైనిక్ స్కూల్ కోచ్ జయలక్ష్మి తెలిపినట్లు లక్షిత తండ్రి డాక్టర్ సీవీ మదన్‌కుమార్ సోమవారం తెలిపారు.

నేడు పెన్షనర్ల ధర్నా

అనంతపురం టౌన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యలపై మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్నగౌడ్, కార్యదర్శి జయరామప్ప సోమవారం ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక బిల్లుతోపాటు ప్రవేశట్టిన వ్యాలిడేషన్ సవరణను రద్దు చేయాలన్నారు. కేంద్రంలో 8వ పే కమిషన్‌ను వెంటనే నియమించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని బకాయిలు, డీఆర్ బకాయిలు చెల్లించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తామన్నారు. పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు.

క్రైం కార్నర్

హత్య కేసులో ఏడుగురి అరెస్టు



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశులు

శింగనమల, జూలై14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరువెందుల గ్రామంలో ఈనెల 3న జరిగిన మైలే శంకరయ్య హత్య కేసులో ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి వివరాలను స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ విజయ్‌కుమార్, సీఐ కౌలుట్లయ్యతో కలిసి డీఎస్పీ వెంకటేశులు వెల్లడించారు. ఈనెల 3వ తేదీన మైలే శంకరయ్య మనవరాలు శ్యామల ఇంటి వెనుక ఉన్న దారికి ముళ్లకంపలు అడ్డంగా వేసింది. ఈ విషయమై పక్కనే నివాసం ఉంటున్న దాసరి ప్రభాకర్ భార్య సరస్వతి, తల్లి రత్నమ్మ అదే రోజు మధ్యాహ్నం శ్యామలతో గొడవపడ్డారు. సాయంత్రం ఇంటికొచ్చిన ప్రభాకర్‌కు విషయం చెప్పారు. దీంతో ప్రభాకర్, అతడి తమ్ముడు త్రినాథ్, బంధువులు రమేష్, శేఖర్, నాగేంద్ర, రామచంద్ర, శ్రీనివాసులు, సరస్వతి, రత్నమ్మ కలిసి కట్టెలు, రాళ్లు తీసుకుని శ్యామల భర్త మల్లికార్జునను వెతుక్కుంటూ శంకరయ్య ఇంటి వద్దకెళ్లారు. 'మల్లికార్జున ఎక్కడ?' అంటూ నానా దుర్భాషలాడారు. కొన్ని రోజుల్లో పీర్ల పండుగ ఉందనీ, ఈ సమయంలో గొడవలు వద్దనీ, సమస్య ఉంటే తరువాత మాట్లాడుకుందామని శంకరయ్య సర్దిచెప్పినా వినలేదు. ఆగ్రహంతో ఉన్న ప్రభాకర్, త్రినాథ్, రమేష్, శేఖర్, నాగేంద్ర, రామచంద్ర, శ్రీనివాసులు కలిసి శంకరయ్య, అతడి బంధువులు బాలగంగిరెడ్డి, నాగేంద్ర, అమ్ములన్న, పెద్దరాజుపై కట్టెలతో దాడి చేశారు. శంకరయ్య తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా దాసరి ప్రభాకర్, త్రినాథ్, రమేష్, శేఖర్, నాగేంద్ర, రామచంద్ర, శ్రీనివాసులును మండలంలోని నాయనపల్లి క్రాస్ వద్ద అరెస్టు చేసినట్లు డీఎస్పీ వివరించారు.

విద్యుదాఘాతానికి కౌలు రైతు బలి



పెద్దారెడ్డి (ఫైల్)

యల్లనూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మంపల్లి గ్రామానికి చెందిన బసిరెడ్డి పెద్దారెడ్డి (49) విద్యుదాఘాతంతో ఆదివారం రాత్రి మృతి చెందినట్లు ఏఎస్ఐ సంపత్ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు పెద్దారెడ్డి లక్షుంపల్లి గ్రామ సమీపంలో 8 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేశాడు. పంటకు నీరు పెట్టడానికి రాత్రి 10గంటల సమయంలో ఇంటి నుంచి తోటకు వెళ్లాడు. అక్కడ మోటారు ఆన్ చేయడానికి స్టార్టర్‌లోకి వెళ్లే వైర్లు తగిలిస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కాసేపటి తర్వాత పొలం వద్దకు వెళ్లిన పెద్ద కుమారుడికి తండ్రి కనిపించలేదు. దీంతో పొలం అంతా వెదికాడు. చివరకు స్టార్టర్ పెట్టె వద్ద విగతజీవిగా పడి ఉన్న తండ్రి కనిపించడంతో బోరుమంటూ కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చాడు. మృతుడికి భార్య రమాదేవి, కుమారులు సాయిప్రతాప్‌రెడ్డి, అశోక్‌రెడ్డి ఉన్నారు. కుమారుడు సాయిప్రసాద్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటో బోల్తా

- ఒకరి మృతి.. ఐదుగురికి గాయాలు

గుత్తి, జూలై14(ఆంధ్రజ్యోతి): గుత్తి ఆర్ఎస్ రోడ్డులో సోమవారం ఆటో బోల్తా పడి ఎరుకలప్ప(65) అనే వ్యక్తి మృతిచెందగా.. మరో ఐదుగురు గాయపడ్డారు. కర్ణాటకలోని హోస్పేటకు చెందిన ఎరుకలప్ప, వీరభద్రప్ప, తిమ్మప్ప సొంతూరి నుంచి రైలులో గుత్తి ఆర్ఎస్‌కు వచ్చారు. వారు పెద్దవడుగూరుకు వెళ్లాల్సి ఉంది. ఆర్ఎస్ నుంచి గుత్తికి వచ్చేందుకు ఆటో ఎక్కారు. అదే ఆటోలో గుత్తికి చెందిన విజయలక్ష్మి, గుత్తి ఆర్ఎస్‌కు చెం దిన రాజు కూడా ఎక్కారు. కేంద్రీయ విద్యాలయం సమీపాన కుక్క అ డ్డువచ్చింది. డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో ఆటో అదుపుతప్పి బోల్తా ప డింది. ప్రమాదంలో ఎరుకలప్ప, వీరభద్రప్ప, తిమ్మప్ప, విజయలక్ష్మి, రాజు గాయపడ్డారు. వీరిని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎరుకలప్ప పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి ఏర్పాట్ల కోసం వెళితే చోరీ

- కారులో ఉంచిన రూ.ఏడు లక్షల అపహరణ



అనుమానితులు

గోరంట్ల, జూలై14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై పట్టపగలే కారులోని రూ.ఏడు లక్షలు గుర్తుతెలియని దుండగులు చోరీ చేసిన సంఘటన స్థానిక శ్రీవాసవీ మహల్ వద్ద సోమవారం జరిగింది. మండలంలోని మల్లాపల్లి బీపీఎం (బ్రాంచ్ పోస్టుమాస్టర్)రామచంద్రరావు కుమారుడి పెళ్లి నవంబరులో చేయాలని నిర్ణయించారు. ఏర్పాట్లలో భాగంగా బంగారం కోసం అడ్వాన్సు ఇవ్వడానికి రామచంద్రరావు అతడి సోదరుడు రిటైర్డ్ వీఆర్‌ఓ వసంతరావు, కుమారుడు నాగతేజ ముగ్గురు కారులో గోరంట్లకు వచ్చారు. ఉదయం 11.30గంటల సమయంలో స్టేట్‌బ్యాంక్‌లో రూ.ఏడు లక్షల డ్రా చేసి కారులోనే బంగారం దుకాణానికి వెళ్లారు. షాపు యజమాని లేకపోవడంతో నేరుగా వాసవీమహల్‌వద్దకు వెళ్లి రహదారి పక్కన కారు ఆపారు. నగదు మొత్తాన్ని కారులో ఉంచి, అద్దాలు లాక్ చేసి, కల్యాణమండపాన్ని పరిశీలించడానికి వెళ్లారు. తిరిగి వచ్చేసరికి కారు ముందు ఎడమవైపు ఉన్న అద్దం పగలకొట్టి డబ్బు చోరీ చేసినట్లు బాధితులు చెప్పారు. సీఐ శేఖర్‌కు ఫిర్యాదు చేయగా, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. రెండు పల్సర్ వాహనాల్లో నలుగురు వ్యక్తులు బ్యాంక్ వద్ద నుంచి కారును వెంబడించినట్లు బాధితులు తెలిపారు. పెనుకొండ డీఎస్పీ నరసింగప్ప గోరంట్ల పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని సిబ్బందిని అప్రమత్తం చేసి, సీసీపుటేజీ ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేశారు.

పెళ్లి కాలేదని నమ్మించి..!

- విడాకులు పొందిన మహిళతో రెండో పెళ్లి
- డబ్బు, బంగారం కాజేసి.. ప్లేటు ఫిరాయింపు
- పోలీసులను ఆశ్రయించిన గర్భిణి



పోలీసుస్టేషన్ వద్ద బాధితురాలు, కుటుంబ సభ్యులు, నాయకులు

గుంతకల్లు టౌన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): పెళ్లి కాలేదని నమ్మించి, తనను వివాహం చేసుకుని మోసగించాడని గుంతకల్లు పట్టణానికి చెందిన వీఆర్వో మహ్మద్ అలీపై షేక్ షమీమ్ అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నాయకులతో కలిసి బాధితురాలు న్యాయం కోసం గుంతకల్లు వన్‌టౌన్ పోలీసులకు ఆశ్రయించారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల మేరకు, గుంతకల్లు భాగ్యనగర్‌కు చెందిన పీరాన్ కూతురు షేక్ షమీమ్ బానుకు 2017లో రాయచూర్‌కు చెందిన షామీర్‌తో వివాహమైంది. వీరికి ఐదేళ్ల కుమారుడు అబ్బాస్ అలీ ఉన్నాడు. దంపతుల మధ్య విభేదాల కారణంగా 2023లో విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి షమీమ్ తనక కుమారుడితో కలిసి తల్లిదండ్రుల వద్ద ఉంటున్నారు. రేషన్ కార్డులో తన కుమారుడి పేరు చేర్చాలని గుంతకల్లు మున్సిపాలిటీలోని 24వ సచివాలయంలో ఆమె సుమారు ఏడాదిన్నర క్రితం దరఖాస్తు చేశారు. అక్కడ వీఆర్వో మహమ్మద్ అలీ పరిచయమయ్యాడు. అవసరమైన డాక్యుమెంట్లు తీసుకుని, రెండు రోజుల తరువాత రమ్మని సూచించాడు. ఈ క్రమంలో ఆమె గత జీవితం గురించి తెలుసుకుని పరిచయం పెంచుకున్నాడు. 'నీకూ మంచి రోజులు వస్తాయి.. బాధపడకు' అని ఓదార్చాడు. ఇంటి స్థలం, ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మంచి రూ.లక్ష తీసుకున్నాడు. ఆ తరువాత మాయ మాటలు చెప్పి, గత ఏడాది మే 22న అనంతపురానికి తీసుకెళ్లి వివాహం చేసుకున్నాడు. ప్రస్తుతం షమీమ్ ఏడు నెలల గర్భిణి. ఈ విషయం తెలుసుకున్న మహమ్మద్ అలీ మొదటి భార్య నూర్జహాన్, ఆమె కుటుంబ సభ్యులు నెల క్రితం షమీమ్ వద్దకు వచ్చి గొడవపడ్డారు. ఆమెను దూషించి, దాడి చేసి వెళ్లారు. దీంతో మహమ్మద్ అలీకి ఇది వరకే వివాహం జరిగిన విషయం షమీమ్‌కు తెలిసింది. ఈ విషయంపై పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ జరిగింది. ఆ సమయంలో తన భర్త మహమ్మద్ అలీ, ఆయన మొదటి భార్య, ఆమె అన్నలు, వదినలు తనను అసభ్య పదజాలంతో దూషించారని, తన తండ్రిని చంపేస్తామని బెదిరించారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. మహమ్మద్ అలి తన బంగారాన్ని యాంకర్ వెల్ఫేర్ బెంగళూరు బ్రాంచిలో తాకట్టు పెట్టి రూ.2 లక్షలు రుణం తీసుకున్నాడని వాపోయారు. ఆ డబ్బులను రెండింతలు చేస్తానని నమ్మించి మోసగించాడని ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్త, అతని మొదటి భార్య, ఆమె అన్నలు, వదినలపై చట్టపరమైన చర్యలు తీసుకుని, తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని, బాధితురాలికి న్యాయం జరిగేలా చూస్తామని వన్‌టౌన్ సీఐ మనోహర్ తెలిపారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతపురం విద్య, జూలై 14(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల దరకాస్తు గడువును పొడిగించినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు సోమవారం ప్రకటనలో తెలిపారు. కనీసం పదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకునన ఉపాధ్యాయులు మాత్రమే అర్హులన్నారు. మార్గదర్శకాలకు సంబంధించిన వివరాలు డీఈఓ బ్లాగ్‌లో ఉంచామన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో మాత్రమే చేసుకోవాల్సి ఉంటుందన్నారు. తర్వాత ఉన్నతాధికారి ధ్రువీకరణతో ఈనెల 16వతేదీ సాయంత్రంలోపు చేసిన ఆ దరఖాస్తులను జిల్లా కార్యాలయంలో అందజేయాలని డీఈఓ కోరారు.

చీనీ టన్ను రూ.19 వేలు

అనంతపురం రూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం సీజనల్ రకం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.19వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.3వేలు, సరాసరి ధర రూ.13వేలు పలికాయని పేర్కొన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 1275 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు వివరించారు.

20న బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 14(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక పోటీలు ఈనెల 20వ తేదీన న్యూటౌన్ బాలుర జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నారు. జూనియర్, సబ్ జూనియర్ బాల, బాలికల విభాగాల్లో సెలెక్షన్స్ ఉంటాయని జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు ఈశ్వరయ్య, వెంకటేశులు తెలిపారు. 2010 జనవరి 2వతేదీ తరువాత జన్మించిన వారు సబ్‌జూనియర్, 2006 జనవరి 2 తరువాత జన్మించిన వారు జూనియర్ విభాగానికి అర్హులన్నారు. ఎంపికైన వారు రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఆసక్తి, అర్హతగల వారు జనన ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, యూనిఫాం, క్రీడాసామగ్రితో హాజరుకావాలన్నారు. వివరాలకు 9966188133 నంబరులో సంప్రదించాలని కోరారు.

గూడ్స్‌రైలు ఢీకొని రైతు మృతి

చెన్నేకొత్తపల్లి, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆ మిదాలకుంట సమీపాన ఆదివారం రాత్రి గూడ్స్ రైలు ఢీకొని రైతు రామాంజనేయులు (43) మరణించాడు. హిందూపురం రైల్వేహెడ్‌కానిస్టేబుల్ మురళి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సి.ఆమిదాల కుంట గ్రామానికి చెందిన రామాంజనేయులు తోట వద్దకెళ్లాడు. పనిముగించుకుని తిరిగి ఇంటికి వస్తూ రైల్వే ట్రాక్ దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సోమవారం ఉదయం రైల్వే పోలీసులు ఘటనస్థలాన్ని పరిశీలించారు. కుటుంబసభ్యుల ద్వారా మృతదేహాన్ని గుర్తించిన తరువాత పెనుకొండ ఆస్పత్రికి తరలించారు. రామాంజనేయులుకు భార్య శమంతకమణి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రైల్వేపోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో బాలికకు గాయాలు

ధర్మవరం, జూలై 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శారదానగర్‌లో ఓ ఇంటి నిర్మాణం వద్ద ప్రమాదవశాత్తు ఓ బాలిక విద్యుదాఘాతంతో సోమవారం తీవ్రంగా గాయపడింది. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు ....ఒంగోలు నుంచి హరి, రాధిక దంపతులు మూడు నెలల కిందట కూలి పనుల కోసం వలస వచ్చారు. ఈక్రమంలో శారదానగర్‌లో ఓ ఇంటి నిర్మాణానికి కూలి పనులకు తమ కుమార్తె వెంకటేశ్వరితో కలిసి వెళ్లారు. తల్లిదండ్రులు పనుల్లో నిమగ్నమవ్వగా, వెంకటేశ్వరి అక్కడే ఆడుకోవడం ప్రారంభించింది. ఈక్రమంలో అక్కడ ఇనుపరాడ్లకు కరెంటు సరఫరా అవుతుండటాన్ని గమనించని బాలిక దాన్ని తాకింది. దీంతో విద్యుదాఘాతానికి గురైంది. గమనించిన తల్లిదండ్రులు వెంటనే బాలికను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

అదరగొట్టిన అనంత బౌలర్లు

- నెల్లూరు 237 ఆలౌట్
- నాలుగో రౌండ్ మల్టీ డే క్రికెట్ పోటీలు ప్రారంభం



వినయ్‌కుమార్



జై కృష్ణ

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 14(ఆంధ్రజ్యోతి): అనంత బౌలర్ల ధాటికి నెల్లూరు బ్యాటర్లు చేతులెత్తేశారు. వినయ్‌కుమార్, జైకృష్ణ చెరో నాలుగు వికెట్లు పడగొట్టడంతో నెల్లూరు కోలుకోలేకపోయింది. నాలుగో రౌండ్ మల్టీ డే క్రికెట్ పోటీలు సోమవారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో ప్రారంభమయ్యాయి. రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో నెల్లూరు-అనంతపురం జట్లు తలపడ్డాయి. మొదటి ఇన్నింగ్స్‌లో నెల్లూరు 69.1 ఓవర్లలో 237 పరుగులకు ఆలౌటైంది. ధృవ్‌తేజ (62), రోషన్ పవన్‌కుమార్ (55) హాఫ్ సెంచరీలు చేశారు. అనంతపురం బౌలర్లు వినయ్‌కుమార్, జైకృష్ణ చెలరేగిపోయారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు ఆటముగిసే సమయానికి 23 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 106 పరుగులు చేసింది. చైత్రవర్ధన్ (55), రోహిత్‌రోషన్ (29) రాణించారు. అనంతపూర్ క్రికెట్ గ్రౌండ్‌లో కర్నూలు-కడప జట్ల మధ్య పోటీ సాగుతోంది. కర్నూలు మొదటి ఇన్నింగ్స్‌లో 59.4 ఓవర్లలో 210 పరుగులకు ఆలౌటైంది. తౌఫీక్ హుస్సేన్ (49), మురళి (40), ఇస్మాయిల్ (44), అంజనేయులు (31) ఫర్వాలేదనిపించారు. కడప బౌలర్లు పఠాన్‌షరీఫ్ 4, అరీఫ్‌బాషా 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప 23 ఓవర్లలో వికెట్ నష్టానికి 117 పరుగులు చేసింది. వంశీకృష్ణ అజేయ హాఫ్ సెంచరీ (77)తో కొనసాగుతున్నాడు.

రూ.20 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలే 'అనంత'లక్ష్మి లక్ష్యం

- ప్రతి సంవత్సరం 400కుపైగా ప్లేస్‌మెంట్స్
- 4 గదులు, 240 మంది విద్యార్థులతో ప్రారంభం
- నేడు 8 బ్రాంచ్‌లు, 1380 బీటెక్ ఇంజనీరింగ్ సీట్లు
- అటానమస్ కళాశాల నుంచి వర్సిటీవైపు అడుగులు
- అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ అంతరాముడు



అనంతపురం వైద్యం, జూలై 14(ఆంధ్రజ్యోతి): సాధారణ వ్యవసాయ కుటుంబంనుంచి వచ్చిన అనంతరాముడు 1972లో బీఏ డిగ్రీ పూర్తిచేసి బ్యాంక్ ఉద్యోగానికి హైదరాబాద్ బయలుదేరాడు. అప్పటికే తాత, తండ్రికి వ్యవసాయంలో తోడుగావుంటూ పంటల దిగుబడిని మద్రాసు మార్కెట్‌లో అమ్మివచ్చేవాడు. సొంతూరితోపాటు చుట్టుపక్క గ్రామాల ప్రజలకు మనమే వ్యవసాయకూలీ పనిని కల్పిస్తున్నాం, పదిమందిని జీతం పెట్టుకున్నాం. మనం ఇంకొకరివద్దకు జీతం వెళ్లడమేంటని వారు అడ్డుకున్నారు. జీతానికి వెళ్లడంకాదు జీతాలు ఇచ్చేస్థాయికి మనం ఎదగాలన్న కుటుంబ పెద్దల సూచన అనంతరాముడి ఆలోచన మార్చివేసింది. ఈ నేపథ్యంలో వ్యవసాయంలోని లోపాలను గుర్తించి అధునాత పద్ధతిలో పంటలు పండించేస్థాయికి చేరుకున్నాడు. అన్నదానం కంటే విద్యాదానం గొప్పదని భావించిన అనంతరాముడు.. విద్యారంగంవైపు ప్రయాణించారు. ఎస్కేయూ దగ్గర ఇటుకలపల్లి సమీపంలోని బైస్ రోడ్డు పక్కన అనంతలక్ష్మి విద్యాసంస్థల పేరుతో 2008లో ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటుచేశారు. నాలుగు గదులు, 240మందితో బీటెక్ ఇంజనీరింగ్ కళాశాలను ప్రారంభించి నేడు 8 బ్రాంచ్(కోర్సు)లు, 1380సీట్లతో అటానమస్(స్వయం ప్రతిపత్తి) కళాశాలగా తీర్చిదిద్దారు. ప్రతి సంవత్సరం 400మందికిపైగా విద్యార్థులకు ఉద్యోగాలు కల్పిస్తూ వారిని సొంతకాళ్లపై నిలబెడుతున్నారు. కళాశాలలో మెరుగైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, అధునాత ల్యాబ్‌లు, స్కిల్ డెవలప్‌మెంట్ తదితర అంశాల్లో జాతీయ సంస్థలైన న్యాక్, ఎన్‌బీఏ, ఐఎస్ఓ అక్రిడిటేషన్ గుర్తింపునిచ్చాయి. అటానమస్ కళాశాలనుంచి వర్సిటీవైపు అడుగులు వేస్తున్న కళాశాలలో బీటెక్ ఇంజనీరింగ్‌తో విద్యార్థుల బవిష్యత్‌పై 'ఆంధ్రజ్యోతి'తో పలు అంశాలను అనంతరాముడు పంచుకున్నారు.

ప్ర: విద్యార్థులకు ఉద్యోగాలే లక్ష్యంగా ఏం చేస్తున్నారు?

జ: తల్లిదండ్రులు వారి పిల్లలు ప్రయోజకులుగా కావాలని మా కళాశాలలో చేర్పిస్తున్నారు. వారికి పాఠాలునేర్పి పాస్‌కాగానే సర్టిఫికెట్స్‌ను అందజేసి పంపితే వారి ఆశలు నెరవేరవు. ఉద్యోగాలకు అవసరమైన స్కిల్స్‌ను డెవలప్‌చేసి కళాశాలలోనే క్యాంపస్ సెలెక్షన్స్ చేపడుతున్నాం.

ప్ర: ఎంతమందికి ఉద్యోగాలొస్తున్నాయి?

జ: ప్రతి విద్యార్థికి ఉద్యోగం వస్తుంది. ప్రతి సంవత్సరం 400మందికిపైగా ఉద్యోగాలకు వెళ్తున్నారు. మిగిలినవారు ఇంకా పైచదువులకు వెళ్తున్నారు. రూ.5లక్షల నుంచి రూ.8లక్షల వార్షిక వేతనం(ప్యాకేజ్)తో ఎంపికవుతున్నారు. భవిష్యత్తులో రూ.20లక్షల ప్యాకేజ్‌తో ఉద్యోగాలు కల్పించేలా ప్రణాళికలు అమలుచేశాం.

ప్ర: కళాశాలలో ఏయే బ్రాంచ్‌లు ఉన్నాయి?

జ: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సీఎస్ఈ), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో డేటా సైన్స్(సీఎస్‌డీ), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లర్నింగ్(సీఎస్ఎం), కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లోనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(సీఏఐ), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యునికేషన్(ఈసీఈ), ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్(ఈఈఈ), సివిల్ ఇంజనీరింగ్(సీఐవీ), మెకానికల్ ఇంజనీరింగ్(ఎంఈసీ) మొత్తం ఎనిమిది బ్రాంచ్‌లున్నాయి.

ప్ర: బ్రాంచ్‌కు ఎన్ని సీట్లున్నాయి, ఫీజు ఎంత?

జ: సీఎస్ఈ 540, సీఎస్‌డీ 60, సీఎస్ఎం 300, సీఏఐ 60, ఈసీఈ 300, ఈఈఈ 60, సీఐవీ 30, ఎంఈసీ 30 మొత్తం 1380 సీట్లున్నాయి. కన్వీనర్ కోటా కింద చేరే పేద విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వమే ఫీజురీయింబర్స్‌ను చెల్లిస్తుంది.

ప్ర: కౌన్సెలింగ్‌లో కళాశాలను ఎలాఎంచుకోవాలి?

జ: ఏపీఈఏసెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఇప్పటికే కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేసుకున్నారు. ఇక కళాశాల, బ్రాంచ్ ఎంపికలు మొదలుపెట్టారు. అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల కోడ్ 'ALTS' ను ఎంపిక చేసుకుని, వారికి నచ్చిన బ్రాంచ్‌కు టిక్ పెట్టాలి. మొదటి ప్రాధానత్యగా 'ALTSకు ఆప్షన్ ఇచ్చుకుంటే సీట్ అలాట్‌మెంట్ అవుతుంది.

ప్ర: పాఠ్యాంశాల రూపకల్పన?

జ: అకడమిక్ సిలబస్‌ను జేఎన్టీయూ రూపొందిస్తుంది. అయితే వాటిలో మార్పుచేసుకునే అవకాశం అటానమస్ అయిన అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలకుంది. జాతీయ, అంతర్జాతీయ సంస్థల అవసరాలను దృష్టిలో పెట్టుకుని సిలబస్‌ను ఫ్రేమ్‌చేస్తున్నాం. ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సులువుగా పొందే అంశాలు. సొంతంగా పరిశ్రమలు నెలకొల్పేందుకు అవసరమైన అంశాలతో కూడిన పాఠాంశ్యాలను రూపొందిస్తున్నాం.

హెచ్చెల్సీకి నవంబరు వరకు నీరు

- సరిహద్దులో కాలువను పరిశీలించిన ఎస్ఈఈ



సరిహద్దులో కాలువను పరిశీలిస్తున్న డ్యాం ఎస్ఈఈ నారాయణనాయక్

బొమ్మనహాళ్, జూలె 14(ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీకి తుంగభద్ర జలాలను నవంబరు ఆఖరి వరకు ఇచ్చే అవకాశాలు ఉన్నాయని తుంగభద్ర డ్యాం ఎస్ఈఈ నారాయణనాయక్, ఎస్డీఓ ప్రవీణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. బొమ్మనహాళ్ సరిహద్దు వరకు హెచ్చెల్సీని సోమవారం వారు పరిశీలించారు. తుంగభద్ర జలాలను ఈ నెల 10న విడుదల చేసిన నేపథ్యంలో కాలువ స్థితిపై పరిశీలించినట్లు వారు తెలిపారు. తుంగభద్రకు ఇన్‌ఫ్లో తగ్గిందన్నారు. ఆంధ్ర వాటా 18 టీఎంసీలు నీరు వస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం డ్యాం నుంచి 1400 క్యూసెక్కులు వదలగా సరిహద్దు 105 కిలోమీటర్ వద్ద 500 క్యూసెక్కులు నీరు వస్తున్నట్లు తెలిపారు. ఆంధ్ర ఎగువ కాలువలో అత్యవసర మరమ్మతు పనులు జరుగుతున్న నేపథ్యంలో నీటిని తీసుకోవడంలో మరి కొద్ది రోజులు ఆలస్యం కావచ్చని వారు తెలిపారు.

విషపు గుళికల ఘాటుతో విద్యార్థిని మృతి



శివప్రియ(ఫైల్)

తాడిపత్రి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): విషపు గుళికల ఘాటు తగిలి మండలంలోని బందార్లపల్లి గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థిని శివప్రియ (14) మృతి చెందింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకుం బందార్లపల్లికి చెందిన భువనేశ్వర్‌రెడ్డి, లక్ష్మిదేవి దంపతుల కుమార్తె శివప్రియ బ్రాహ్మణపల్లి జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. రోజూ ఇంటి నుంచి బడికి వెళ్లి వచ్చేది. ఈక్రమంలో సోమవారం ఉదయాన్నే పూజ చేసి స్కూలుకు వెళ్లాలనే ఉద్దేశ్యంతో ఇల్లు శుద్ధి చేయడానికి పూనుకుంది. పురుగు పట్టకుండా ఉండటానికి విషపు గుళికలు కలిపి దాదాపు 50 బస్తాల వేగశనగకాయలు ఇంట్లోనే ఒక గదిలో నిల్వ ఉంచారు. అయితే ఏమరుపాటుతో శివప్రియ ఆ గది తలుపు తెరిచింది. ఒక్కసారిగా గుళికల ఘాటు బాలిక ముక్కును తాకింది. దీంతో ఆమె సొమ్మసిల్లి పడిపోయింది. తల్లిదండ్రులు గమనించి తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించగా, చికిత్స పొందుతూ బాలిక మృతి చెందింది. దీంతో తల్లిదండ్రులు, బంధువులు బోరున విలపించారు.

11 సొసైటీలకు త్రిసభ్య కమిటీల నియామకం

అనంతపురం క్లాక్‌టవర్, జూలై14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 11 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(సొసైటీ)లకు త్రిసభ్య కమిటీల పాలకవర్గాలను నియమిస్తూ సోమవారం రాష్ట్ర వ్యవసాయ-సహకార శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. నూతన కమిటీల పదవీకాలం నెలాఖరు వరకు ఉంటుంది.

త్రిసభ్య కమిటీల వివరాలు..

సొసైటీ	చైర్మన్	సభ్యులు
మామడూరు	సురేష్	కర్ణ, రామకొండయ్య
తొండపాడు	శివశంకర	రమణ, సుంకన్న
గుంతకల్లు	మస్తానప్ప	సుబ్బయ్య, శివశంకర్ రెడ్డి
పి కొత్తపల్లి	శ్రీనివాసరెడ్డి	పద్మావతి, ఖాదర్‌బాషా
గార్లదిన్నె	విశ్వనాథనాయుడు	ప్రతాప్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి
ఎర్రగుంటపల్లి	జయరామిరెడ్డి	బ్రహ్మయ్య, విశ్వనాథ్
యాడికి	చలమారెడ్డి	ఓబులేసు, మనోహరచౌదరి
చాపిరి	నారాయణ	శ్రీరాములు, నాగన్న
గొల్లపల్లి	గురుమూర్తి	దాదాపీర్, కవితమ్మ
డి కొండాపురం	వీరభద్ర	రామాంజనేయులు, గంగాధరశెట్టి

వీకే పార్వతమ్మ మృతి తీరనిలోటు: సీపీఎం



వీకే పార్వతమ్మ భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం టౌన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు వీకే ఆదినారాయణరెడ్డి సతీమణి వీకే పార్వతమ్మ మృతి వామపక్ష, ప్రజాతంత్ర ఉద్యమాలకు తీరని లోటు అని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. వీకే పార్వతమ్మ (101) ఆదివారం మొదటిరోడ్డులోని తన నివాసంలో వయోభారంతో తుదిశ్వాస విడిచారు. సోమవారం వామపక్ష, అనుబంధ సంఘాల నాయకులు ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం గుత్తిరోడ్డులోని హరిశ్చంద్ర ఘాట్‌లో ఆమెకు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో సీపీఎం సీనియర్ నాయకుడు ఓబులు, ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రమ్మ తదితరులు వీకే పార్వతమ్మ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ... వీకే పార్వతమ్మ జిల్లా కమ్యూనిస్టు ఉద్యమంలో కీలకంగా పనిచేశారన్నారు. మహిళా ఉద్యమ పోరాటాల్లో ఆమె కృషి మరువలేనిదన్నారు. అనేకమంది కమ్యూనిస్టు కార్యకర్తలకు అండగా ఉన్నారని పేర్కొన్నారు. భర్తకు తోడుగా ఉంటూనే కార్యకర్తలు, నాయకులను కమ్యూనిస్టు ఉద్యమంలో పాల్గొనేలా ప్రోత్సహించారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రామిరెడ్డి, ఐద్వా నేత చంద్రిక పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నిరుద్యోగ భృతి చెల్లించాలి: ఏఐవైఎఫ్



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు, నిరుద్యోగులు

అనంతపురం విద్య, జూలై 14(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగభృతి చెల్లించి నిరుద్యోగులను ఆదుకోవాలని ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. నిరుద్యోగులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కేంద్రంలో ఏఐవైఎఫ్ ఆందోళన చేపట్టింది. తొలుత నగరంలో నిరుద్యోగులతో కలిసి ర్యాలీ చేపడుతూ కలెక్టరేట్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్‌రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు అందించి ఆదుకుంటామని కూటమి హామీ ఇచ్చిందన్నారు. ఏడాది దాటినా ఇప్పటికీ నిరుద్యోగభృతి ఇవ్వకపోవడం అన్యాయం అన్నారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు ధనుంజయ, దేవేంద్ర, శ్రీకాంత్, శ్రీనివాస్, ఆనంద్, రాంబాబు, లిఖిల్, ముజీర్, కన్నా పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

గార్లదిన్నె, జూలై 14(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఉమాదేవి (38) అనే వివాహిత సోమవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన ఉమాదేవి, మరియమ్మ అనే చిరువ్యాపారులు అనంతపురం నుంచి మొక్క జొన్న కంకులు ఆటోలో వేసుకుని తిరుగు ప్రయాణంలో కల్లూరు వద్ద నిలిపి ఉన్న ఆటోను బస్సు ఢీ కొనడంతో ఆటో డ్రైవర్ మహమ్మద్‌హుసేన్ (48) అక్కడికక్కడే మృతి చెందగా.. ఉమాదేవి, మరియమ్మ తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ప్రమాదంలో గాయపడిన ఉమాదేవి, మరియమ్మను చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఉమాదేవి సోమవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

పొలాలకు రస్తా చూపించండి

రామగిరి, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలేపల్లి, అక్కంపల్లి రైతులు తమ పొలాలకు వెళ్లే దారిని చూపించాలని తహసీల్దార్ రవికుమార్‌కు సోమవారం వినతి పత్రం అందించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో పోలేపల్లికి చెందిన రైతులు ప్రభాకర్, చంద్రాయుడు తదితరులు తహసీల్దార్‌కు తమ సమస్యను వివరించారు. తమ పొలాల్లోకి పూర్వం నుంచి రస్తా ఉందని, ఇప్పుడు కొందరు అడ్డు వేశారని తెలిపారు. ఇప్పటికే ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తెచ్చామని అన్నారు.

తెలుగుదేశం పార్టీతోనే సంక్షేమం


కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

అనంతపురంరూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీతోనే అభివృద్ధి, సంక్షేమం జరుగుతుందని పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జ్ డిష్ నాగరాజు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఎ.నారాయణపురంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లస్టర్ ఇన్‌చార్జ్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు డిష్ నాగరాజు, మాజీ ఉపసర్పంచు ఓబుళపతి, తెలుగురైతు రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి రఘునాథ్ తదితరులు ఇంటింటికి తిరుగుతూ కూటమి ప్రభుత్వ పాలనను వివరించారు. కార్యక్రమంలో నాయకులు వరాలమ్మ, ఈశ్వరయ్య అశ్విని, అక్షిత పాల్గొన్నారు.

● రాప్తాడు : టీడీపీ ప్రభుత్వంలోనే సుపరిపాలన సాధ్యమని మండల కన్వీనర్ పంపు కొండప్ప తెలిపారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రసన్నాయపల్లి పంచాయతి చిన్మయ్‌నగర్‌లో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉప్పర శ్రీనివాసులు, క్లస్టర్ ఇన్‌చార్జ్ సోమర నారాయణస్వామి పాల్గొన్నారు.

బతికుండగానే.. చంపేశారు..!

5 సెంట్లు అక్రమంగా రిజిస్ట్రేషన్.. వృద్ధురాలి ఆవేదన


ఫిర్యాదు చేయడానికి వచ్చిన వృద్ధురాలు

అనంతపురం క్రైం, జూలై 14(ఆంధ్రజ్యోతి): తాను బతికుండగానే 5 సెంట్ల భూమి కోసం రికార్డుల్లో మరణించినట్లు చూసి అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్నారని 75 ఏళ్ల వృద్ధురాలు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక డీపీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో ఎస్పీ జగదీష్.. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లా నలు మూలల నుంచీ వచ్చిన ప్రజలు 120 వినతులు అందించారు.

మరణించినట్లు చూపి.. కాజేశారు....

తాడిపత్రి మండలం నందలపాడు కుమ్మర గేరిలో నివాసం ఉంటున్న తనకి సర్వే నంబర్ 104-బీలో 10 సెంట్ల భూమి ఉందని నక్కలోళ్ల లక్ష్మీదేవి పేర్కొన్నారు. కొడుకు ఓబులేసు మరణించడంతో తన మనవడు రామాంజనేయులు, ఆయన భార్య లక్ష్మీదేవి సంరక్షణలో ఉన్నానని తెలిపారు. తన స్థలాన్ని కోడలు జయలక్ష్మి, మనవరాలు వరలక్ష్మి మరికొందరితో కలిసి కాజేశారన్నారు. తాను చనిపోయినట్లుగా చూపించి నాకున్న స్థలంలో 5 సెంట్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. రాచానపల్లికి చెందిన మరో వృద్ధురాలు సైతం స్థల సమస్యపై ఎస్పీకి విన్నవించుకున్నారు. తన భర్త నర్సాపురము బాబావలి నుంచీ ప్రాణహాని ఉందంటూ నర్సాపురానికి చెందిన షాహినా.. ఎస్పీని విన్నవించుకున్నారు. పత్తికొండ మండలం చిన్నహుల్తికి చెందిన తనకు పెద్దవడుగూరు మండలం నర్సాపురముకు చెందిన బాబావలితో 9 ఏళ్ల కిందట వివాహమైంది. తమకు మూడేళ్ల పాప ఉందని తెలిపారు. ఇటీవల భర్త నుంచీ విడిపోయానని చెప్పారు. తన భర్త ఎలాగైనా తనను చంపి, బిడ్డను తీసుకెళ్లాలని చూస్తున్నాడని వాపోయారు. ప్రాణహాని ఉందని భర్త నుంచి కాపాడాలంటూ ఎస్పీకి విన్నవించుకున్నారు.

దళితులపై దాడులా..?

దళితులపై దాడులు ఆపాలంటూ...ఎస్సీఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి, బాధితులు సురేష్, రామాంజినేయులు, అశోక్, నాగరాజు, పుల్లయ్య మరికొందరు పీజీఆర్ఎస్‌లో విన్నవించుకున్నారు. వజ్రకరూరు మండలం చాబాలలో మొహర్రం సందర్భంగా కొందరు ఎస్ఐ సమక్షంలోనే దళితులను కించపరిచేలా తిట్టారని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే... వారం రోజులుగా కేసులు కట్టలేదన్నారు. దళితులకు ఏమాత్రం రక్షణ లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

వరుణుడి కోసం ఎదురుచూపులు

● ఒక వైపు ఎండుతున్న వేరుశనగ ● మరోవైపు విత్తనానికి సిద్ధంగా పొలాలు



సలకంచెరువు వద్ద ఎండిపోతున్న వేరుశనగ పంట, ఈస్టు నరసాపురం వద్ద విత్తనం వేయడానికి సిద్ధంగా ఉన్న పొలం

శింగనమల, జూలై 14(ఆంధ్రజ్యోతి): ముంగార్ల ప్రారంభంలో మురిపించిన వరుణుడు.. మొహం చాటేశాడు. ఒక వైపు విత్తిన వేరుశనగ ఎండిపోతోంది. మరో వైపు విత్తనం వేయడానికి పొలాలను సిద్ధం చేసుకుని రైతులు ఎదురు చూస్తున్నారు. వేసిన వేరుశనగ మొలకలు ఎండిపోతున్నాయని కొందరు రైతులు ఆందోళన చెందుతుంటే.. అదును దాటిపోతోందని విత్తనాలు సిద్ధం చేసుకున్న రైతులు మదన పడుతున్నారు. శింగనమల మండలంలో తొలి వర్షాలకే కొన్ని ప్రాంతాల్లో వేరుశనగ, ఇతర పంటలు సాగు చేశారు. పంట బాగా పెరుగుతున్న దశలో వర్షం రాకపోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. మరికొన్ని గ్రామాల్లో పొలాలను సిద్ధం చేసుకున్న రైతులు వరుణ దేవుడా కరుణించవా అని ప్రార్థిస్తున్నారు. సలకంచెరువు, చిన్నజలాలపురం, మట్లగొంది, గురుగుంట్ల, వెస్టునరసాపురం, సోదనపల్లి ప్రాంతాలతోపాటు మరికొన్ని చోట్ల నెల కిందట వచ్చిన కొద్దిపాటి వర్షానికే వేరుశనగ, ఇతర పంటలు సాగు చేశారు. విత్తనం వేసినప్పటి నుంచి పెద్ద వర్షం రాకపోవడంతో ప్రస్తుతం పంట ఎండిపోతోంది. వర్షం కోసం రైతులు ఆకాశంవైపు ఎదురుచూస్తున్నారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్తున్న సీఎం: పరిటాల సునీత


కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురంరూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు తీసుకెళుతున్నారని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఆలమూరు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్థులు, టీడీపీ శ్రేణులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. నాయకులతో కలసి ఇంటింటికి వెళ్లి ఏడాది కాలంలో చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. ఎవరికైనా పథకాలు అందాయా లేదా అని ఆరా తీశారు. పలువురు భూ సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..సుపరిపాలన అంటే ఏమిటో ఏడాదిలో చూపించామన్నారు. తొలి ఏడాదిలోనే ఇచ్చిన హామీల్లో 90శాతం పైగా నెరవేర్చామన్నారు. త్వరలోనే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, అన్నదాత సుఖీభవ పథకాలు అమలు చేస్తామని అన్నారు. వైసీపీ పాలనలో నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సమస్యల గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రికార్డు స్థాయిలో డ్రైనేజీలు, రోడ్లు నిర్మించామన్నారు. వైసీపీ వినాశనం నుంచి రాష్ట్రం ఇప్పుడిప్పుడే కోలుకుంటోందన్నారు. మెగా డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టులు భర్తీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ, నాయకులు రఘు, సూరి, సంజీవరాయుడు, బాలకృష్ణ పాల్గొన్నారు.

'అనంత'ను అగ్రస్థానంలో నిలుపుతాం: ఎమ్మెల్యే


ప్రజలకు కరపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం క్రైం, జూలై 14(ఆంధ్రజ్యోతి): రానున్న నాలుగేళ్లలో రాష్ట్రం లో అనంతపురం నగరాన్ని నెంబర్ వన్ స్థానంలో నిలుపుతామని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. 26వ డివిజన్‌లోని హమాలీ కాలనీలో నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివవరించారు. తొలిఅడుగు కరపత్రాలు అందించి కూటమి ప్రభుత్వం ఏడాది పాలన ఎలా ఉందంటూ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక కాలనీ వాసులు మాట్లాడుతూ.. స్థానికంగా రోడ్డు సమస్య ఉందన్నారు. రోడ్డు వేస్తామని ఆయన హామీ ఇచ్చారు. తర్వాత ఆయన మాట్లాడుతూ...గత ఐదేళ్లలో నగరంలో చిన్న డ్రైనేజీ, రోడ్డు కూడా వేయలేదన్నారు. తాము వచ్చిన ఏడాది కాలంలో అనంతపురంలో రూ.118 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు తమ్మినేని వేణుగోపాల్, గడ్డం సుబ్రహ్మణ్యం, బుగ్గయ్య చౌదరి, గౌస్ మొద్దీన్, సరిపూటి రమణ, ఫిరోజ్ అమ్మద్, సంగా తేజస్విని, దలవాయి వెంకటరమణ, పీఎల్ఎన్ మూర్తి, కొండన్న, పరమేశ్వర్, శివ, నారాయణస్వామి, స్వామిదాస్, బాలాంజినేయులు, బాబా ఫకృద్దీన్, పల్లవి, సరళ, గోపాల్ గౌడ్, బాలకృష్ణ, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

వీకే పార్వతమ్మకు నివాళి

కమ్యూనిస్టు యోధుడు వీకే ఆదినారాయణ సతీమణి వీకే పార్వతమ్మ భౌతిక కాయానికి ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ ఘనంగా నివాళి అర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉద్యమాల్లో వీకేకు పార్వతమ్మ చేదోడువాదోడుగా ఉంటూ క్రియాశీలక పాత్ర పోషించారని కొనియాడారు.

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల వంటావార్పు



వంటావార్పులో సహపంక్తి భోజనాలు చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 14(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మెలో భాగంగా రెండో రోజు సోమవారం స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట వంటావార్పు నిర్వహించారు. సీఐటీయూ నాయకులతో కలిసి మున్సిపల్ కార్మికులు సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు వెంకట నారాయణ, ముత్తూజా, ఉపాధ్యక్షుడు రామిరెడ్డి మాట్లాడుతూ.. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కరోనా సమయంలో తమ ప్రాణాలను అరిచేతిలో పెట్టుకొని ప్రజలకు సేవ చేసిన మున్సిపల్ కార్మికులను విస్మరించడం బాధాకరమన్నారు. కార్మికులకు కనీస వేతనం పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులకు వేతనాలు పెంచిన ప్రభుత్వం ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచడంలో నిర్లక్ష్యం చేయడం ఏమిటని ప్రశ్నించారు. కార్మికులందరూ సమష్టిగా సమ్మెలోకి పాల్గొని కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం గౌరవాధ్యక్షుడు గోపాల్, అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున, సంజీవరాయుడు, ఓబుళపతి, మురళీ, పోతులయ్య, తిరుమలేష్, ఎర్రిస్వామి, లక్ష్మినరసమ్మ, లక్ష్మీనారాయణ, ఆది, కోనప్ప, పెన్నా, రవికిరణ్, శివన్న, లక్ష్మి, జగదీష్, సుబ్బిరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలి

శింగనమల, జూలై 14(ఆంధ్రజ్యోతి): వాతావరణ, ఫసల్ పంటల బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే బీమారంగసంస్థలకు చెల్లించాని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు డి.చిన్నప్పయాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం శింగనమల తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతుల సమస్యలపై రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా చిన్నప్పయాదవ్ మాట్లాడుతూ.. రైతులు, కౌలు రైతులు అప్పులు తీసుకు వచ్చి పంటలు సాగు చేస్తున్నారని, ప్రభుత్వమే ఉచిత బీమా ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మధుయాదవ్,మధు, మునిస్వామి, వెంకటరెడ్డి, నారప్ప తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు పూర్వవైభవం తెస్తాం

శింగనమల, జూలై 14(ఆంధ్రజ్యోతి): శింగనమల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి పూర్వవైభవం తీసుకు వస్తామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సాకే శంకర్ పేర్కొన్నారు. సోమవారం శింగనమల ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి నియోజకవర్గంలో మంచి పట్టు ఉందని, రాజకీయ పరిణామాలతో కొద్దిగా వెనుకబాటు ఉందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న కార్యాక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లి నియోజకవర్గంలో పూర్వ వైభవం తీసుకొస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ చెర్మన్ జక్కుల రామ్ చరణ్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్‌యాదవ్, నాయకులు గంగరాజు, నారాయణ స్వామి, సంజీవులు, శివారెడ్డి, నరసింహరెడ్డి, సూరి, ప్రభుదాసు, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీటీని కాపాడుకోవడమే లక్ష్యం

శింగనమల, జూలై 14(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల కల్పతరువు ఆర్డీటీని కాపాడుకోవడమే మన లక్ష్యం కావాలని ఆర్డీటీ పరిరక్షణ జేఏసీ కన్వీనర్ సాకే హరి పేర్కొన్నారు. సోమవారం శింగనమల తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరించాలని తహసీల్దార్ శేషారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీటీ పరిరక్షణ జేఏసీ నాయకులు సాకే హరి, సాకే రాజు, సుగమంచి శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఆర్డీటీ జిల్లా నుంచి తరలిపోతే పేదల బతుకుల్లో చీకట్లు అలుముకుంటాయని అన్నారు. గృహ నిర్మాణం, వ్యవసాయం, ఉపాధి, క్రీడా రంగాల్లో ఆర్డీటీ సేవలు అమోఘమన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు, శివమూర్తి, పుష్ప, రామాంజి, శశికళ పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ ఎంతో ఉపయోగకరం

రాప్తాడు, జూలై 14(ఆంధ్రజ్యోతి): సోలార్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసి వినియోగించుకునేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ పథకం ప్రజలకు ఎంతో ఉపయోగకరమని విద్యుత్‌శాఖ ఏఈ శివకుమార్ తెలిపారు. మండలంలోని గంగలకుంట గ్రామంలో సోమవారం సాయంత్రం ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటిపై సోలార్ పలకలు ఏర్పాటు చేసుకుని విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని అన్నారు. ఇంటిపై సోలార్ పలకలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం సబ్సిడీ కూడా అందిస్తుందన్నారు. ప్రజలు పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ అవకాశంను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సాకే తిరుపాలు, రాజు పాల్గొన్నారు.

రాయలసీమను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలి

● సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లండి ● రాయలసీమ రాష్ట్ర సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కుంచం


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కుంచం వెంకటసుబ్బారెడ్డి

అనంతపురం టౌన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఈ ప్రాంత ప్రజల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, రాయలసీమను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని రాయలసీమ రాష్ట్ర సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కుంచం వెంకటసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర విభజనానంతరం ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ముఖ్యంగా రాయలసీమ వాసులకు పెద్ద దెబ్బ పడిందన్నారు. కాబట్టి రాయలసీమను ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటించి ఆదుకోవాలని, లేనిపక్షంలో కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించాలని కోరారు. రాయలసీమను అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.10లక్షల కోట్లు కేటాయించాలన్నారు. రైల్వేజోన్‌ను గుంతకల్లుకు మార్చాలనీ, సీమలో పరిశ్రమల స్థాపనతో నిరుద్యోగాన్ని తగ్గించాలన్ని డిమాండ్ చేశారు. సీమలో ఏర్పాటు చేసే అన్ని రకాల పరిశ్రమల్లో స్థానికులకే 80శాతం ఉద్యోగాలు కేటాయించాలని కోరారు. రాయలసీమవాసుల కష్టాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, ప్రత్యేక రాష్ట్ర సాధనకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రాయలసీమ రాష్ట్ర సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి రామాంజులరెడ్డి, నేతలు రామిరెడ్డి, ఖాసీం, సయ్యద్‌వలి, ఓబులరెడ్డి సోమసుందర్‌రెడ్డి, శ్యామసుందర్‌రాజు, బీఎస్పీ జిల్లా నాయకుడు సాకే నాగేశ్వరయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బీబీ ఫాతిమా తొలిదర్శనం


బీబీ ఫాతిమా తొలిదర్శనంలో పాల్గొన్న భక్తులు

అనంతపురం టౌన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐదో రోడ్డులోని బీబీ ఫాతిమా దర్గా వద్ద సోమవారం సాయంత్రం అమ్మవారి తొలిదర్శనాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత దర్గాలో అమ్మవారి ఆభరణాలతో కూడిన పెట్టెను బయటకు తీసి బీబీ ఫాతిమా పీరు తొలిదర్శనం నిర్వహించారు. అనంతరం పెట్టెను పురవీధుల్లో మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ ఊరేగించారు. దర్గా ముందు అగ్నిగుండం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీబీ ఫాతిమా బ్రహ్మోత్సవ నిర్వాహకులు మల్లికార్జున, నరసింహులు, కేఎస్ మురళి, కిశోర్, మహేష్, చంద్రశేఖర్, అజ్జి, తిమ్మప్ప పాల్గొన్నారు.

కష్టపడిన వారికి గుర్తింపు


కొర్రపాడులో గ్రామ కమిటీని ఎంపిక చేస్తున్న రామలింగారెడ్డి, శ్రీధర్ బాబు

బుక్కరాయసముద్రం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుందని, కమిటీల ఎంపికతో టీడీపీని మరింత బలోపేతం చేద్దామని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని జంతులూరు, నీలంపల్లి, చెదుల్లా, నీలారెడ్డిపల్లి, కొర్రపాడు, రోటరీపురం, బుక్కరాయసముద్రం గ్రామాల్లో టీడీపీ గ్రామ కమిటీలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి, పార్టీని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అశోక్, లక్ష్మీనారాయణ, నారాయణ స్వామి, కేశన్న, రవీంద్ర, సోము పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ రాష్ట్ర సబ్‌జూనియర్ పోటీల్లో

అనంతపురం జట్టు విజయం


విజేత జట్టును అభినందిస్తున్న అసోసియేషన్ సభ్యులు, దాతలు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర సబ్ జూనియర్ ఫుట్‌బాల్ పోటీల విజేతగా అనంతపురం జట్టు నిలిచింది. ఆదివారం రాజమండ్రిలో నిర్వహించిన ఏపీ ఫుట్‌బాల్ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ చాంపియన్స్ ట్రోఫీ-2025 ఫైనల్స్‌లో ఎన్టీఆర్ కృష్ణా జిల్లాతో అనంతపురం జట్టు తలపడంది. రెండు గోల్స్ తేడాతో అనంతపురం జట్టు గెలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. దీంతో సోమవారం స్థానిక ఓటీఆర్ఐ ప్రాంగణంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజేత జట్టుకు అభినందన సభ నిర్వహించారు. దాతలు డీఎస్ఏ సభ్యులు హెచ్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత హనుమంతరెడ్డి, కాటమయ్య, బచ్చులన్న, శ్రీనివాస్‌రెడ్డి, చల్లా రామాంజనేయులు, ఎన్‌వైకే శ్రీనివాసులు, రామకృష్ణారెడ్డి, రుద్ర, హనుమంతరెడ్డి, జిల్లా ఫుట్‌బాల్ అసోయేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సరిపూటి వేణుగోపాల్, మల్లేష్, ఉపాధ్యక్షులు నాగరాజు, సీఏ విశ్వనాథ్‌చౌదరి, ప్రసాద్, రత్నమయ్య, సత్యనారాయణ, గోపినాథ్, లక్ష్మినరసప్ప, కోచ్‌లు చిన్నరాజు, సాయి అశోక్ అభినందనలు తెలిపారు.

మాజీ సైనికులకు అండగా ఉంటాం


చెక్కు ఇస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, గడ్డం సుబ్రహ్మణ్యం

అనంతపురం క్రైం, జూలై 14(ఆంధ్రజ్యోతి): మాజీ సైనికులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ భరోసా ఇచ్చారు. సోమవారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డం సుబ్రహ్మణ్యం నివాసంలో మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు షేకన్న ఆధ్వర్యంలో మాజీ సైనికుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సైనికుల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మాజీ సైనికుల సంక్షేమానికి కట్టుబడి ఉంటామన్నారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గడ్డం సుబ్రహ్మణ్యం సైనికుల సంఘానికి లక్ష రూపాయల చెక్కును అందించారు. కార్యక్రమంలో నాయకులు సింగవరం రవి, రంగారెడ్డి, శంకరరావు, లక్ష్మీనారాయణ, ఉమామహేశ్వరరావు, తిమ్మారెడ్డి, మహమ్మద్ ఈర్షద్, శివశంకర్, బాలనాగప్ప పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

గార్లదిన్నె, జూలై 14(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్ పైప్ లైన్) చీఫ్ స్టేషన్ మేనేజర్ అభిమన్యు దాస్, గార్లదిన్నె వైద్యాధికారి మంజుల తెలిపారు. హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ లోకనాథ్ పాల్గొన్నారు.

రోడ్డు నియమాలు పాటించాలి: సీఐ

గార్లదిన్నె, జూలై 14(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ద్వారా ప్రయాణం సురక్షితంగా ఉంటుందని శింగనమల సీఐ కౌలుట్లయ్య సూచించారు. సోమవారం తలగాసిపల్లి జక్షన్ వద్ద ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషాతో కలసి సీఐ వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డుపై వెళుతున్న వాహనాలను నిలిపి రికార్డులు, డ్రైవర్ల లైసెన్స్‌లు పరిశీలించారు.

మున్సిపల్ స్థలాల ఆక్రమణపై చర్యలు

అనంతపురం క్రైం, జూలై 14(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్పొరేషన్‌లో స్థలాలు ఆక్రమించిన వారిపై, నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అధికారులకు సూచించారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో కమిషనర్ బాలస్వామి, ఏసీ పావని, ఇతర అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎస్ఈ చంద్రశేఖర్, ఈఈ షాకీర్, డీఈ నరసింహులు, అధికారులు ఆదినారాయణ, శిరీష పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను కాపాడండి

నార్పల, జూలై 14(ఆంధ్రజ్యోతి): స్థానిక మేజర్ పంచాయతీలోని సర్వే నెంబర్ 197/2లో కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారని, ఆ స్థలాలను కాపాడాలని సోమవారం తహసీల్దార్ అరుణకుమారికి సీపీఐ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ప్రభుత్వ స్థలాలను అధికారులుకాపాడాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నాయకులు సుధాకర్, పెద్దపెద్దయ్య, నారాయణప్ప, సూరి, రాజశేఖర్, శివమ్మ, నబీ ఉన్నారు.

ఇష్టారాజ్యంగా విద్యుత్ స్తంభాల ఏర్పాటు

నిబంధనలు పాటించని కాంట్రాక్టర్.. పొంచివున్న ప్రమాదం

బొమ్మనహాళ్, జూలై 14(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామానికి త్రీఫేస్ విద్యుత్ సరఫరా ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఆర్డీఎస్ పథకాం కింద త్రీఫేస్ విద్యుత్ తీగలు మండలంలో ఏర్పాటు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం చెట్లు, రోడ్డుకు నాలుగు మీటర్ల దూరంలో ఈ స్తంభాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. అలా కాకుండా రోడ్డు పక్కన, చెట్ల మధ్యలో ఈ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. కొన్ని చోట్ల చెట్లను తొలగిస్తున్నారు. మండలంలోని ఎల్బీనగర్ గ్రామం వద్ద విద్యుత్ స్తభాలను చెట్లు పక్కన ఏర్పాటు చేయడంపై స్థానికులు ఆందోళనకు చెందుతున్నారు. చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలను తాకితే షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉంది. కాంట్రాక్టర్ తన స్వలాభం కోసం ఎక్కడ పడితే చెట్లు వద్ద స్తంభాలు ఏర్పాటు చేశారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డు, చెట్లు పక్కన స్తంభాలు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

చెట్లు పక్కన స్తంభాలు ఏర్పాటు చేసినట్లు తమ దృష్టికి ఏవరూ తీసుకోరాలేదు. చెట్లు పక్కన ఏర్పాటు స్తంభాలు ఉంటే ప్రమాదం ఉంటుంది. అలా కాకుండా స్థానికులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకొంటాం

-లక్ష్మిరెడ్డి, విద్యుత్ ఏఈఈ, బొమ్మనహాళ్



చెట్టు కొమ్మల్లో ఉన్న విద్యుత్ స్తంభం

ఓటు అడిగే అర్హత టీడీపీకే ఉంది: ఎమ్మెల్యే



2వ వార్డులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయరాం

గుంతకల్లు, జూలై 14(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో ఓటు అడిగే అర్హత ఒక్క టీడీపీకే ఉందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. సోమవారం ఉదయం పట్టణంలోని 2, 19 వార్డుల్లోనూ, మండలంలోని దోసలుడికి, బుగ్గసంగాల గ్రామాల్లో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, కేసీ హరి, బండారు ఆనంద్, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, ప్రతాప్ నాయుడు, తలారి మస్తానప్ప, పాల మల్లికార్జున, ఆనంద్ రెడ్డి, గుణశేఖర్, ఫజులు, బండారు రామన్న చౌదరి, మత్రునాయక్, వరలక్ష్మి పాల్గొన్నారు.

జడ్పీ పాఠశాలలో ఆయాలకు సన్మానం



ఆయాలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గుత్తి, జూలై 14(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సుంకన్న విద్యార్థినులు, ఉపాధ్యాయుల సమక్షంలో ఆయాలను సోమవారం ఘనంగా సన్మానించారు. ఆయాలు శివమ్మ, జయమ్మ, సుబ్బలక్ష్మి, నారాయణమ్మ, షైలు, రామాంజినేయులు చేస్తున్న పనులను వివరిస్తూ సన్మానించారు. కొన్నేళ్లుగా ఈ పాఠశాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మరుగుదొడ్లు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుతూ ఆయాలు చేస్తున్న సేవలను కొనియాడారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు



బహుమతి అందజేస్తున్న దృశ్యం

తాడిపత్రి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చుక్కలూరు జడ్పీహైస్కూల్లో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ప్రోత్సాహక నగదు బహుమతులు సోమవారం అందజేశారు. 561 మార్కులు సాధించిన ప్రవీణ్‌కుమార్ రూ.5వేలు, 525 మార్కులు తెచ్చుకున్న కల్యాణికి రూ.3వేలు, 511మార్కులు సంపాదించిన మల్లేశ్వరికి రూ.2 వేలు ఇచ్చి సన్మానించారు. ఇందులో ఆ సంఘం అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి, సంఘం సభ్యులు, ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

శెట్టూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): తమపై మండలంలోని మాకొడికి గ్రామానికి చెందిన బీసీ వర్గానికి చెందిన వారు దాడి చేశారని అదే గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీ వర్గానికి చెందిన వారు శెట్టూరు పోలీస్ స్టేషన్లో అదే రోజు ఫిర్యాదు చేశారు. అయితే దాడి చేసిన వారిపై ఇంత వరకు ఎస్సీ, ఎస్టీ కేసు ఎందుకు నమోదు చేయలేదని ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి బాధితులు సోమవారం ఆ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. విచారణ చేపట్టి చర్యలు చేపడతామని ఎస్ఐ రాంభూపాల్ వారికి స్పష్టం చేశారు.



పెద్దపప్పూరులో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పాఠశాల, వైద్యశాల తనిఖీ

పెద్దపప్పూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. తరగతి గదులు, మధ్యాహ్న భోజన పథకాన్ని, తాగునీటిని ఆయన పరిశీలించారు. అనంతరం స్థానిక ప్రాథమిక వైద్యశాలనూ తనిఖీ చేశారు. ఆయన వెంట కూటమి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

● తాడిపత్రి: పట్టణంలోని సీపీఐ కాలనీ, నంద్యాల రోడ్డులో సుపరిపాలకు తొలి అడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి సోమవారం నిర్వహించారు. ఆయన వెంట వైస్‌చైర్మన్ అరుణ, షెక్షావలి, కౌన్సిలర్లు విజ్జి, రంగనాథరెడ్డి, మల్లికార్జున, నాయకులు గంగరాజు, సోమశేఖర్‌నాయుడు, చింబిలి ప్రసాద్‌నాయుడు ఉన్నారు. అలాగే మండలంలోని కోమలి గ్రామంలో పీర్లచావిడి ఎమ్మెల్యే ప్రారంభించారు.

ఎమ్మెల్యే అమిలినేనితోనే అభివృద్ధి

టీడీపీ నాయకుడు తలారి ఎర్రిస్వామి



కళ్యాణదుర్గం, జూలై 14(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం అభివృద్ధి ఒక్క ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ సీనియర్ నాయకుడు తలారి యర్రిస్వామి పేర్కొన్నారు. సోమవారం కంబదూరులో ఆయన స్వగృహంలో వార్డు మెంబర్ ఈరణ్ణతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధిని చూసి వైసీపీ మండల కన్వీనర్ హనుమంతరాయుడుకు మతిభ్రమించిందని, ఓర్వలేక లేనిపోని విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే సొంత నిధులతో కళ్యాణమండపం నిర్మించడమే కాకుండా శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేశారన్నారు. దీంతో పాటు వాల్మీకుల అభివృద్ధికి, వాల్మీకుల సంక్షేమానికి రూ.50 లక్షలు, కురుబల సంక్షేమానికి రూ.25 లక్షలు ఎమ్మెల్యే తన సొంత నిధులను ఖర్చుచేశారని అన్నారు. నియోజకవర్గంలో సుమారు రూ.మూడు కోట్లకు పైబడి నిధులతో సీసీ రోడ్లు వేయించారన్నారు. వైసీపీ హయాంలో కమీషన్ల కక్కుర్తితో నిలిచిపోయినన కంబదూరు-పేరూరు తారు రోడ్డు పనులు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆ పనులను తిరిగి ప్రారంభించారన్నారు. వైసీపీ హయాంలో కమీషన్ల కక్కుర్తితో నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడి.. అధ్వానంగా మారిందని, అమిలినేని రాకతో నియోజకవర్గం అభివృద్ధి బాటలో నడుస్తోందని అన్నారు. వైసీపీ నాయకులు ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకుని విమర్శలు చేయాలని సూచించారు.

పత్తిపంట తొలగింపు



యాడికి, జూలై 14(ఆంధ్రజ్యోతి): యాడికి మండలం చిక్కేపల్లి గ్రామానికి చెందిన రైతు బాదుల్లా సొంత భూమి మూడు ఎకరాలతోపాటు మరో 13 ఎకరాలను కౌలుకు తీసుకొని ముందస్తు కురిసిన వర్షాలకు పత్తిపంట సాగు చేశాడు. అరకొరగా విత్తనం మొలకెత్తడంతో మరళా పత్తి విత్తనం నాటాడు. విత్తనం మొలకెత్తినప్పటికి వర్షాలు కురవకపోవడంతో పత్తిపంట పూర్తిగా ఎండిపోయింది. దీంతో తన మూడు ఎకరాల్లో పంటను ట్రాక్టర్‌తో సోమవారం దున్నేశాడు. కౌలుకు తీసుకొని చేస్తున్న మరో 13 ఎకరాల్లో ఒకటి, రెండు రోజుల్లో పంటను తొలగించబోతున్నట్లు వాపోయాడు. ఎకరాకు రూ.15 వేల ప్రకారం 16ఎకరాలకు రూ.2.50లక్షల దాకా ఖర్చు చేసినట్లు తెలిపాడు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

పుట్లూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని మండలంలోని కడవకల్లు గ్రామస్థులు స్థానిక సచివాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఇందులో ఆ గ్రామస్థులు పెద్దిరెడ్డి, మారుతి, ఎర్రిస్వామి, రంగమ్మ పాల్గొన్నారు.

● కుందుర్పి : మండలంలోని బసాపురంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని స్థానిక సచివాలయం ముందు మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. గ్రామ సర్పంచ్, అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. సమస్యను పరిష్కరిస్తామని ఎంపీడీఓ లక్ష్మీశంకర్ వారికి హామీ ఇచ్చారు.

క్లుప్తంగా ...

కొండ గరుసు తరలింపు అడ్డుకోండి

విడపనకల్లు: మండలంలోని రాష్ట్ర సరిహద్దు వద్ద ఉన్న ఎర్రితాతా తిప్పలో కొంతమంది నాయకులు కొండను తవ్వి కర్ణాటక రాష్ట్రానికి ఎర్రమట్టిని తరలిస్తున్నారని, దాన్ని అరికట్టాలని సీపీఐ నాయకుడు ఎంబీ చెన్న రాయుడు సోమవారం తహసీల్దారుచంద్రమోహన్‌రావుకు వినతి పత్రం అందించారు. కొండలో ఒక్కొక్క చోట 20, 30 అడుగుల లోతు గుంతలు తవ్వారు అని, వారిపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు.

బొగ్గుల ఫ్యాక్టరీని తొలగించండి

విడపనకల్లు : మాళాపురం గ్రామానికి ఆనుకుని ఏర్పాటు చేసిన కట్టెల బొగ్గుల ఫ్యాక్టరిని తొలగించాలని ఆ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఓబుళేసు సోమవారం తాహసీల్దారు చంద్రమోహన్‌రావుకు ఫిర్యాదు చేశారు. ఆ ఫ్యాక్టరీ నుంచి 24 గంటలూ పొగ వస్తోందని, దీంతో అనేక మంది రోగాల బారిన పడుతున్నారని వివరించారు.

ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి

పెద్దవడుగూరు : పంటలకు ఫసల్ పంట బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించాలని రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్ ఉషారాణికి వినతిపత్రం అందజేశారు. ఇందులో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరాముడుయాదవ్, నాయకులు నారాయణ, హుస్సేన్, పీరా, రంగనాయకులు పాల్గొన్నారు.

కమిటీని రద్దు చేయండి

పుట్లూరు:వైసీపీ ప్రభుత్వం హయాంలో కొందరు వ్యక్తులు అంబేద్కర్‌ను అడ్డుపెట్టుకొని కమిటీలు ఏర్పాటు చేసి డబ్బులు వసూలు చేశారని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీనివాసులు అనంతపురం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ కమిటీని రద్దు చేయాలని, స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆవిష్కరించాలని కోరారు.

ఎక్కువ భూమి ఉందని...

బెళుగుప్ప : తన భార్యకు సెంటు భూమి లేకున్నా 29 ఎకరాలుందని సర్వేలో చూపుతున్నారని, దీంతో తన ఇద్దరు కుమార్తెలకు తల్లికి వందనం వర్తించలేదని, సమస్య పరిష్కరించాలని హనిమిరెడ్డిపల్లికి చెందిన విజయ్ కుమార్ తహసీల్దార్ అనిల్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

ఉరవకొండ, : నిబంధనలకు విరుద్ధంగా ఫిట్‌నెస్‌లేని బస్సులను నడుపుతున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి టీ.చందు కోరారు. అనంతపురంలోని గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

నూతన రైల్వే లైన్ రద్దు చేయాలి

గుంతకల్లుటౌన్: మండలంలోని దోనిముక్కల గ్రామం మధ్య నూతన రైల్వే లైన్‌ను రద్దు చేయాలని ఆర్డీఓ ఏబీవీబీఎస్ శ్రీనివాస్, ఏడీఆర్ఎం సుధాకర్‌కు సోమవారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు వడ్డె రమేష్, రైతులు వినతి పత్రం అందజేశాడు. ఈ రైల్వే లైన్ ఏర్పాటు చేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు వద్దు

గుత్తి: విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్, రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ పుణ్యవతి, మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మీయాకు వినతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నిర్మల, నాయకులు రామకృష్ణ, మల్లేష్ పాల్గొన్నారు.

రస్తా సమస్య పరిష్కరించండి

రాయదుర్గంరూరల్ : పట్టణ సమీపంలో ఎంసీఏ లేఅవుట్‌లో ఉన్న ఆంజనేయస్వామి దేవాలయం వద్ద నుంచి ఎర్రబండకు మీదుగా ఆర్‌బీవంక గ్రామానికి ఉన్న దారికి అడ్డంగా ఎర్రబండకు చెందిన నరసింహులు, మల్లికార్జున, ఆంజనేయులు గోడ కట్టారు. దీంతో విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రస్తా సమస్యను పరిష్కరించాలని టీడీపీ మండల కన్వీనర్ హనుమంతు, కాలనీవాసులు తిప్పేస్వామి, హనుమంతు తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందించారు.

ఎనర్జీ అసిస్టెంట్ల ఆందోళన

కణేకల్లు: మండలంలోని ఎనర్జీ అసిస్టెంట్లు పలు సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ ఏఈ శంకర్ నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. నూతన సర్వీసులు రద్దు చేయాలని, తమ ను ఏఎల్ఎంఎల్లుగా ఉద్యోగోన్నతలు కల్పించి బదిలీలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఇబ్రహీం, గోవిందరెడ్డి, జిలాన్, రమేష్, చిన్నికృష్ణ, నాగరాజు, వన్నూరుస్వామి పాల్గొన్నారు.



పుట్లూరు సచివాలయ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న కడవకల్లు గ్రామస్థులు



కుందుర్పి సచివాలయం వద్ద బసాపురం గ్రామస్థుల నిరసన

న్యూస్ బాక్స్

బాధితుడికి ఆర్థిక సాయం

యాడికి, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువు గ్రామానికి చెందిన బాబాఫకృద్దీన్ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. అతను ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించిన జనసేన మండల కన్వీనర్ సునీల్‌కుమార్.. సోమవారం రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. ఆయన వెంట జనసేన నాయకులు జాకీర్, వెంకటేష్, మధుఆచారి, బాబు, రాజేష్, అబ్దుల్ ఉన్నారు.

కూటమి తప్పిదాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

పుట్లూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని వైసీపీ సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజానాథ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 2024 ఎన్నికల మేనిఫెస్టోలో చంద్రబాబు ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ ప్రజలకు తెలపాలన్నారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ అంటూ రూపొందించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ప్రతి ఇంటికి వివరించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ రంగయ్య, వైసీపీ నాయకులు మహేశ్వర్‌రెడ్డి, రాంమోహన్ పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన

బెళుగుప్ప, జూలై 14(ఆంధ్రజ్యోతి): స్థానిక కేజీబీవీలో సోమవారం విద్యార్థినులకు కుష్టు వ్యాధి కీటక జనిత వ్యాధులపై కుష్టువ్యాధి జిల్లా అధికారి నీలకంఠ అవగాహన కల్పించారు. వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన ఆరోగ్య సూత్రాల గురించి వివరించారు. వైద్యులు నారాయణ స్వామి, కేజీబీవీ ఎస్‌వో నాగరత్నబాయి, ఏఎన్ఎం రాధ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి తలారి మధుశ్రీ



బెళుగుప్ప, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన తలారి మధుశ్రీ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతూ పదో తరగతి పరీక్షల్లో 600 మార్కులకు గాను569 మార్కులు సాధించారు. రెండో విడతలో ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈఓలు మల్లారెడ్డి, హరికృష్ణ సోమవారం తెలిపారు.

విద్యుత్ కనెక్షన్ల తొలగింపుపై నిరసన

విడపనకల్లు, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలోని ఎస్సీలు ఒక్కరు కూడా విద్యుత్ బిల్లులు చెల్లించలేదని విద్యుత్ అధికారులు వారి ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లను సోమవారం తొలగించారు. దీంతో ఆ ఎస్సీ కాలనీ వాసులు మండలం కేంద్రంలోని బళారి-అనంతపురం 42వ జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. ఎటువంటి నోటీసులూ ఇవ్వకుండా విద్యుత్ కనెక్షన్లు తొలగించారని వాపోయారు. విద్యుత్ బిల్లులు కోసం కొందరు రూ. వెయ్యి, రెండు వేలు, 5వేలు వరకూ ఇచ్చారని, వాటిని రసీదు ఇవ్వకుండా వారి జోబుల్లోకి వేసుకుని వెళ్లారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఖాజాహుస్సేన్ ఆందోళనకారులతో చర్చించారు. రెండేళ్లుగా పాత బకాయిలు ఉన్నాయని, వాటిని చెల్లించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని, అయినా విద్యుత్ అధికారులతో మాట్లాడి విద్యుత్ అందరికీ విద్యుత్ కనెక్షన్లు ఇప్పిస్తామని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

బాధ్యతల స్వీకరణ



అధ్యక్షుడిని సన్మానిస్తున్న సభ్యులు, నాయకులు

కణేకల్లు, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రహ్మసముద్రం సొసైటీ అధ్యక్షుడిగా బీ రామాంజినేయులు, సభ్యులుగా తిప్పయ్య, మేఘనాథ్ సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. స్థానిక సొసైటీలో అధికారులు వారి చేత ప్రమాణస్వీకారం చేయించారు. వీరిని టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, కోళకుర్తి సుదర్శన్, రామప్ప, మారుతి, అంజినేయులు సన్మానించారు.

పంచాయతీ పరిశీలన

పుట్లూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మనమల పంచాయతీని సెంట్రల్ కమిటీ సభ్యుడు రామచంద్ర సోమవారం పరిశీలించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2025లో భాగంగా పంచాయతీలో వర్మీ కంపోస్టు, అంగన్‌వాడీ, పాఠశాల, ఉపాధిహామీలో చేపట్టిన పనులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ సెక్రటరీ పెద్దన్న, నాగప్ప ఉన్నారు.

కొనసాగిన మున్సిపల్ కార్మికుల సమ్మె



గుత్తి : మోకాళ్లపై నిలబడి కార్మికుల నిరసన

గుత్తి, జూలై 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని ఇంజనీరింగ్ విభాగం కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మె రెండో రోజైన సోమవారమూ కొనసాగింది. మోకాళ్లపై నిలబడి వారు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం అధ్యక్ష, కార్యదర్శులు రాజా, రవిశంకర్, నాయకులు మురళీ, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

● తాడిపత్రి : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల జీవో నెంబరు 36 సాధన కోసం పట్టణంలో చేపట్టిన సమ్మె రెండో రోజైన సోమవారమూ కొనసాగింది. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జగన్ మోహన్‌రెడ్డి, అంజి, రామాంజనేయులు, మహమ్మద్‌బాషా, శ్రీరాములు, జుబేర్, పెంచల ప్రసాద్ పాల్గొన్నారు.

● రాయదుర్గంరూరల్: మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపడుతున్న సమ్మె పట్ల కమిషనర్ బెదిరింపులను తక్షణమే ఆపాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారమూ కొనసాగింది. స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు వంటవార్పు కార్యక్రమం చేపట్టి.. రోడ్డుపైనే భోజనం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

బొమ్మనహాళ్, జూలై 14(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల ఆధ్యక్షురాలు పద్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నాట్లు ఎంపీడీఓ విజయభాస్కర్ సోమవారం తెలిపారు. మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని, అధికారులు గైర్హాజరు అయితే జిల్లా అధికారులు నివేదిక అందిస్తామని చెప్పారు.

బీజేపీలో పలువురి చేరిక

తాడిపత్రి, జూలై 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నందలపాడుకు చెందిన పలువురు మహిళలు రాష్ట్ర లీగల్ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, కర్నూలు జిల్లా ఇన్‌చార్జ్ అంకాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ రంగనాథరెడ్డి, పట్టణ మాజీ అధ్య క్షుడు ఆంజనేయులు, పట్టణ అధ్యక్షుడు కృష్ణమోహనరాజు పాల్గొన్నారు.

మొక్కల అందజేత

రాయదుర్గంరూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవుల దట్ల జడ్పీ హైస్కూల్‌కు రాయదుర్గం శాఖ కల్కి మానవసేవ సమితి దాదాపు రూ.20 విలువ చేసే మొక్కలను అందజేసింది. సోమవారం వాటిని ఆ పాఠశాల ఆవరణంలో ఆ సమితి సభ్యులు నాటారు. ఇందులో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్..

వ్యక్తిపై కత్తులతో దాడి

తాడిపత్రి, జూలై 14(ఆంధ్రజ్యోతి): స్థానిక టైలర్స్ కాలనీకి చెందిన హర్షపై అదే ప్రాంతానికి చెందిన నాగరాజు, మరి కొందమంది కత్తులతో దాడి చేశారు. సోమవారం రాత్రి హర్ష బైక్‌పై కాలువ గడ్డన ప్రాంతంలో వెళ్తుండగా.. వీరు దాడి చేసి పారిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని.. కొన ఊపిరితో ఉన్న హర్షను స్థానిక ప్రభుత్వ పాఠశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. దాడికి కారణాలు తెల్సియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

చెట్టు కూలి ఇద్దరికి గాయాలు

కళ్యాణదుర్గంరూరల్, జూలై14(ఆంధ్రజ్యోతి): శెట్టూరు మండలం బొచ్చుపల్లికి చెందిన రామలింగ, మహాలక్ష్మి ద్విచక్రవాహనంపై కళ్యాణదుర్గానికి సోమవారం వెళ్లారు. తిరిగి వస్తుండగా.. పాపంపల్లి, చిన్నంపల్లికి మధ్యలో రోడ్డు పక్కన ఉన్న ఓ చెట్టు కూలి.. వీరిపై పడింది. దీంతో ఆ భార్యభర్తలిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారికి కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి ఓ ఆటోలో తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి కియ ఉద్యోగులు..

కళ్యాణదుర్గం, జూలై 14(ఆంధ్రజ్యోతి): కంబదూరు మండలంలోని కదిరిదేవరపల్లి కోటగుడ్డం గ్రామానికి చెందిన గణేష్, చైతన్య, వంశీ కియా పరిశ్రమలో పనిచేస్తున్నారు. వీరు ద్విచక్రవాహనంలో సోమవారం విధులకు వెళ్తుండగా.. కంబదూరు మండలంలోని అచ్చంపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద తారు రోడ్డు నిర్మాణానికి పరిచిన కంకర రోడ్డుమీద బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. ఆ ముగ్గురికి తీవ్రంగా గాయపడ్డారు. 108కు ఫోన్ చేయగా సాంకేతిక సమస్యతో అంబులెన్స్ ఆస్పత్రి వద్దే ఆగిపోయినట్లు సమాచారం ఇచ్చారు. దీంతో గాయపడిన ఆ యువకులే బంధువులకు సమాచారం అందించారు.వారు సంఘటన స్థలానికి వచ్చి ద్విచక్రవాహనాల్లో వారిని కంబదూరు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. కంబదూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీకి యత్నం

కళ్యాణదుర్గంరూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): బెళుగుప్ప మండలం విరుపాపల్లికి చెందిన రైతు గోవిందరాజులు పట్టణంలోని యూనియన్ బ్యాంకులో రూ. ఆరు లక్షలు నగదును సోమవారం విత్‌డ్రా చేసుకున్నాడు. తన స్కూటీ డిక్కీలో పెట్టుకొని.. విద్యుత్ కార్యాలయ ఆవరణంలో ఉన్న హోటల్‌లోకి భోజనానికి వెళ్లారు. గుర్తుతెలియని వ్యక్తి తన స్కూటీ డిక్కీ ఓపెన్ చేస్తుండటాన్ని గమనించి .. గట్టిగా కేకలు వేశాడు. దీంతో ఆ దొంగ అక్కడి నుంచి పారిపోయాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

పోక్సో కేసు నమోదు

తాడిపత్రి, జూలై 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన వంశీ ఓ బాలికను మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేశాడు. బాలిక తల్లిదండ్రులు పోలీసుల దృష్టికి రావడంతో వంశీని అదుపులోకి తీసుకొని విచారించారు. బాలికను విడిపించి అతనిపై పోక్సో కేసు నమోదు చేశామని సీఐ సాయిప్రసాద్ సోమవారం తెలిపారు.

పగలే చోరీ

తాడిపత్రి, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని సజ్జలదిన్నెలో బాలక్క, సురేష్ నాపరాళ్లపరిశ్రమలో కూలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం వారు పనులకు వెళ్లగా.. దుండగులు వారి ఇంటి తాళాలు పగలగొట్టి ఇంటిలోని బంగారు కమ్మలు, పిల్లల ఉంగరాలు, సుమారు రూ. 10 వేలు ఎత్తుకెళ్లారు. ఇంటికి తిరిగి వచ్చిన వారు చోరీ జరిగినట్లు గుర్తించి.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారించి కేసు నమోదుచేస్తామని పోలీసులు తెలిపారు.

● జూదరుల అరెస్ట్

మండలంలోని సజ్జలదిన్నె గ్రామ సమీపంలో ముళ్లపొదల్లో పేకాట ఆడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసి.. వారి నుంచి సుమారు రూ.8600 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

ఇరువర్గాలపై కేసు

పుట్లూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంజీవపురంలో హరీష్ ఇంటిని నిర్మిస్తుండగా.. తన ఇంటిపై సిమెంట్, ఇసుక పడుతున్నాయని నాగభూషణం అడ్డు చెప్పాడు. దీంతో సోమవారం ఇరువర్గాల వారు గొడవపడ్డారు. పరస్పరం ఫిర్యాదుల మేరకు నలుగురిపై కేసు నమోదుచేసినట్లు సీఐ సత్యబాబు తెలిపారు.

విద్యాసామగ్రి పంపిణీ



విద్యార్థులతో కాకర్ల సోదరులు

తాడిపత్రి, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవులతిప్పాయపల్లి గ్రామ సమీపంలో ఉన్న భగవాన్ శ్రీ రమణ మహర్షి అనాథ పాఠశాలలోని 50 మంది విద్యార్థులకు రూ.లక్ష విలువగల విద్యా సామగ్రి, దుస్తులను కాకర్ల సోదరులు సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాకర్ల రంగనాథ్, కాకర్ల జగన్నాథ్, కాకర్ల రంగనాయకులు, రంగ ప్రబంజన్, రంగ యశశ్విని పాల్గొన్నారు.